# 1

# ఎదురు తిరిగితే...

[కరీంనగర్ జిల్లా, మంథెన తాలూకా, గాజులపల్లి
గ్రామంలోని ప్రజల భాష ఈకథలో వాడబడింది.]

"దండమయ్యా పటేలా" అంగి[1] దండం బెట్టిండు పోశమల్లు. అ వెనుక సేతులు పిసుక్కుంట నిలబడ్డడు పోశమల్లు ఎనుక మాదిగగూడెం సిన్న,పెద్ద నిలబడ్డరు.

ఇంటిముంగటి గద్దెమీన కూకుండి పండ్లు తోముతున్న నరసయ్యా తుపుక్కున ఊంచి మారు దండం బెట్టకుంటనె"ఏందో సెప్పుండ్రా...." అన్నడు.

"నువ్వు సెప్పరాదుర పెదకొంర...." కర్రెపోశడు దూరంగా కింద కూకుండుకుంట అన్నడు.

మందిని జరుపుకుంట ముంగటి[1A] కచ్చిండు నంబర్ కొంరడు.

---

1. వంగి 1 A. ముందుకు

''పటేలా గదే బాంచెన్, ఆనాడేదో బుడ్డి గడ్డి తిన్నందుకు దొరోరు నీరటి బిచ్చం[3] ఎగబెట్టింరా? తోలొలిసి ఆఖరికి అమీన్ కచ్చీర్ల[4] పెట్టిన సంగతి మీ కెరుకేనాయె.... ఇయ్యేడు తొంటకొంరని కొడుకు లింగడు, తొస్సెదుర్గి కొడుకు కర్రెలింగడు కల్సి కన్‌రెడ్డి కుంటెనక నీంటి తనము జేసిర్రు కదుండీ! దొరోరు ఏడాది పొంట నీళ్ళు పెట్టిచ్చుకొని ఆఖరికత్తె[5] జీతమెగ బెట్టిర్రు....'' కొంరడు గుక్కతిప్పుకున్నడు.

''అదెరికేనురా, దొరోరి[6] సంగతి ఎవ్వలకు తెల్వదని? దాని కొరకేం జెయ్యాల్నో సెప్పురా'' పండ్లపుల్ల దూరంగా ఇసిరేసి నర్సయ్య బోడగుండు మీన్నుంచి తొంటసెయ్యిని పోనిచ్చి ఉండీ లేనట్టున్న జుట్టిపోసను దొరుకబట్టి దాన్ని దువ్వుకుంట అన్నడు.

''సువ్వాగుర కొంరె....ఇగనేఁ జెప్పుత....''పోశమల్లు ముంగటి కచ్చిండు[7].

''నర్సయ్య పటేలా! ఏటా కన్‌రెడ్డి కుంటెనుక అయిదుగిద్దెలు పెట్టేసంగతి మీ కెరుకేనాయె. సిల్లర, మల్లర ఇద్దూమత్తె,[8] మూడు గిద్దెలు కొత్తదొరయేనాయె, అయింత మూడు గిద్దెలు ఎగబెట్టిరంటె కుంట బట్టినోని నోట్లె మన్నేగదా! ఈన్దికొద్దిగా మోరుదోప్పని, అదిగాక ఎనకటినుంచి ఈనయ్య కులపెద్దగదా అని పెద్దజేత్తె ఓట్లప్పుడు కోమటి కిట్టయ్య పటేలు దగ్గర్నుంచి కచ్చెదుగడ్డి దెచ్చుకున్నడు. పోనియ్యి అని

---

2. అదే 3. పొలానికి నీరుపెట్టినందుకు కూలీ 4. (అమీన్ కచ్చీర్ల) పోలీస్ స్టేషన్లో 5. చివరకువస్తే. 6. దొరవారి 7. వచ్చినాడు 8. రెండు తూములువస్తె (తెలంగాణలో ధాన్యం కొలత)

ఊకుంటె నాటి, నాత్రి లేసి దొరోరి దొయ్య[9] కట్టుకచ్చిండు. ఈడు సెయ్యవట్టి దొరోరు తొంటకొంరని కొడుకు లింగనికి, కర్రె లింగనికి ఏడాదంత నీళ్ళు పెట్టిచ్చుకొని నీరటిబిచ్చము ఎగపెట్టిర్రు, ........' పోశమల్లి కొంరని తప్పును ఎత్తి సూపిచ్చుకుంట సెప్పింది.

మందిని జరుపుకుంట తొంట కొంరని కొడుకు లింగడు ముంగటి కచ్చిండు. ఆనెనుక అని అవ్వ [10]గట్టు మల్లి, నర్సయ్య ముంగటి కచ్చింది.........ఆళ్ళిద్దరు కాల్ల కాడి నేలమీన రెండు సేతులతో ముట్టుకొని మొక్కిర్రు.

"నీ కాల్ల కిందోల్లము బాంచెన్ నిలువుతా ముంచిర్రు నా కొడుకును'' గట్టుమల్లి సక్కగ నిలబడి అన్నది.

''దెహేఁ నువ్వట్లాగరాయె...." లింగడు కసిరిండు.

''నువ్వట్లుండరాదు రా బాంచ కొడుక, పటేలుకు కట్టసుకము సెప్పుకుంటాంటె నీకెందుకురా? గిట్టసేసే ఇల్లు ముంచినవ్....ఏడాది పొడుగుత కట్టబడి పోరగండ్లను కూడులేకుంట సంపుతంటివి. మాదండి 'మొగోడచ్చిండు మంచమెల్లులుక [11] లేయి అన్నదట' నీకెప్పుడు ఉరుకు లాటె....''సేతులు ఆరుసుకుంట లింగన్నికసిరింది....

లింగడు ముఖం మాడుసుకున్నడు.

''ఊకోయె[12] గట్టు మల్లి .... ఆఁ .... ఏందిర లింగ ....?" కిందికి మీదికి నాలుగుసార్లు గురుకపెట్టి[13] తుపుక్కున ఊంచిండు.

---

9. దొయ్యపొలం (?)  10. అమ్మ  11. వెల్లకిల  12. ఊరుకో
13. కాండ్రించి

''మీకు సెప్పెటోన్న బాంచెన్. కొందరు సెయ్యవట్టయితేంది? దొరోరు సెయ్య వట్టయితేంది? నా పోరగాండ్ల కడుపుల మీన కొడుతాండ్రు. పిల్లలు గల్లోన్ని బాంచెన్, ఆరుగాలము [14] కట్టబడ్డరు బాంచెన్ నాకచ్చే ఇత్తులి [15] ప్పియ్యండ్రి బాంచెన్ .... '' నర్సయ్య ముఖంలకు దీనంగ సూసుకుంట అన్నడు లింగడు.

''మీరెంత ఏమంటండ్రా....'' నర్సయ్య మాదిగోళ్ళ కెల్లి సూసిండు.

''పెద్ద మనుసుల్ని కుప్ప జెయ్యమన్నమ్. పెద్దలోకులు ఇసారించి తప్పు నిర్నాయము జేయ్యండ్రి బాంచెన్'' గడిపెల్లి జక్కడు గుతుప కట్టెను నిలపొడిసి దానిమీద గద్దువ [16] ఆన్చుకొని నిలబడి అన్నడు....

''అయితే పోశాలుకు, కిట్టయ్యకు సెప్పిరాపి....'' నర్సయ్య లేచి నిలబడుకుంట అన్నడు.

''తమరికే ముందుగాలు సెప్పాలని అచ్చినం....బాంచెన్....'' లొస్సెదుర్గి కొడుకు కర్రె లింగడు అన్నడు.

''సరె సెప్పుండ్రి గని [17] నాకియ్యల్ల తీర్తదో? తీరదో? పెద్ద కొడుకు సూర్లకు సూర్లు, ఇమ్మడికి ముమ్మడి ఎదురుబియ్యం బత్తాలు[18] కొంచబొయ్యి పట్నంలో సదువుతున్నడాయె .... సిన్నకొడుకు లిద్దరు ఇంకోకాడ సదువుతున్నరాయె....పాలేర్లున్నరు.ఒకడు తాళ్ళ [19] పంచె ఇంకోడు ఈదులల్ల [20] పంటడు. నేను సేతకెల్లి [21] బోంవి ఎల్లదాయె, నడుగు [22] గుత్తబడితె ఎవ్వళ్ళు అటు మొఖాన అచ్చిన పాపాన

14. ఎల్లకాలము 15. గింజలు (విత్తనాలు) 16 గడ్డం 17. కాని 18. బస్తాలు 19. తాటిచెట్లు 20. ఈతచెట్లు 21. పనికి 22. రోడ్డు

పోరు....సుప్పురబేగ్ అత్తె నర్సయ్యేడి అని నన్నే అడిగె - టేపేసి కాలుత్తే లెక్కలు సేసుకుంట ఎంటబోవన్నాయె....నాకెక్కడి తీరిక.... అయిన అత్తనసుకో. ఇయ్యల్ల కలువదిగని[23] రేపు సూత్తాము.... పోశాలును, కిట్టయ్యను, దొరోరిని ఉండుమన్రి. రేపు అంబటాల్లకు[24] ఘాలచ్చిమికాడ మీ పంచాతి తెంపుదాం...." కాంద్రకిచ్చి ఊంచి ఇంట్లకు నడిసిండు నర్సయ్య....

"బాంచెన్ రేపాల్లంత ఉంటరు? దొరోడుగుడుక[25] ఇంటికాన్నే ఉన్నరట....పోశాలు పటేల్, కిట్టయ్యపటేల్ గుడుక ఉన్నరట బాంచెన్ ....తమరుగుడుక ఉండకబోతేకాదు బాంచెన్...." కర్రె లింగడు పెద్దరువాజ[26] కాడ నిలబడి మొక్కిండు....

"కలువపంటలేసుకు....నేనేమొ ఉరాకండి మనిసిని. మాటా మరోటా? నోరా తాటిమట్టా?" కిర్రుసెప్పులు పందిరికింద ఇడిసి "నీల్లావలికి బట్టే!...." ఇంట్లకు కేకేసిండు....

లింగని కెటు దోసలే, అట్లనె నిలబడ్డడు....

ఇంట్లనుంచి బయటికి వచ్చిన రామక్క "ఊకే[27] పంచాయితిలే పనా బట్టా....? అవతలోల్లు ఏ గంగల పోతేంది?...." ముఖం చిట్లించింది.

"నువ్వు నసరాదే[28] .... లింగా! అయితే పగట్నుంచి సేద్దాము .... ఓ కయికిలోన్ని[29] బెట్టి మా గుట్టకింది పెండికాడికి పొమ్మను" నర్సయ్య అసలు విషయం తేల్సిండు.

---

23. కుదరదుకాని 24. భోజనం వేళకు 25. కూడ 26. పెద్ద తలుపు 27. ఎప్పుడూ 28. ఆగరాదు? 29. కూలివాడ్ని

లింగని మొఖము మాడిపోయింది. ఇంట్ల తినేందుకు ఇత్తులు లేంది కయికి లెట్ల పెట్టగలుగుతడు పాపం.... అయినా ఆశ.... దొరోరిచ్చే అడ్ల [30] మీన ఆశ . . . అప్పో, సప్పో సెయ్యాలనుకుని నర్సయ్య దొడ్డ బుద్దికి మొక్కి ఎనుకకు తిరిగిండు.

''ఏందిరో లింగ! ఇయ్యల్ల అందరి కయికిల్లు పోవాలంటవ? పొద్దుందనుక [31] ఎట్ల కలుత్తదిర?....'' అన్నరు మాదిగోళ్లు.

''ఎట్లారా గింత ఎట్లన్న జెయ్రి ....'' లింగలిద్దరు బతిలాడిరు.

నంబరు కొరండు లేసి బుస బుస లాడుకుంట బూతులు తిట్టుకుంట ఎల్లిపోయిండు.

ఆడెనుక మాదిగోళ్ళంత కదిలిరు....

## 2

ఏపసెట్టు గద్దెమీన పోశాలు కూకుంది. మోకాళ్ళకు పంచెసుట్టుకొని సుట్ట తాగుతండు.... అయినె పక్కకు నర్సయ్య సెట్టుకొరిగి కూకున్నడు— ఏప పుల్లను పండ్ల సందుల్ల పెట్టుకుంట. ఓగెలు గద్దె కింద దుబ్బల్ల కూకున్నరు.

సర్పంచ్ కిట్టయ్య గడెంచలో [32] కూకుండి బీడి పల్లసందుల్ల పెట్టుకొని పిడికిలి మలిసి తాగుతండు.

---

30. వడ్లు, 31. దినమంతా 32, చిన్నమంచము,

గద్దె కెడుపక్కెల్లి [33] దూరంగా మాదిగోల్లంత కూకున్నరు కుప్పగ. మూల తిరుగుడుకాడ మాదిగి ఆడోల్లు గుడిసె సూరుకింద మాసిన పేగులు కట్టుకొని నిలబడ్డరు.

దూరంగ మాదిగోళ్ల పోరగండ్లు దుమ్ములో ఆడుతన్నరు.

''సుంకరి నర్సిమ్మడు జాడ పత్తలేకుంట పోయిండు. గాంధచ్చి సవరాజ్జెమని బొత్తిగ భయం భీతి లేకుండ సేసిండు. లంజకొడుకు లంత మాట ఇనకుంట అయిర్రి....'' సుంకరోని కోసం బజార్లకు సూసుకుంట అన్నడు పోశాలు ...

ఏపసెట్టుమీన కాకులు, గోరెంకలు రొదపెడ్తున్నయి. ఏపచెట్టు ఆకులు రాలిసింది. కొమ్మల సందుగుండ సూరీడు తొంగి సూత్తండు.

సుంకరి నర్సిమ్మడు కొశ్యాటి [34] బరిసె ఎడమసేత పట్టుకొని అందరికి దండాలుసెప్పి నిలబడ్డడు.

"లంజకొడుక...! గింతసేపేంజేసినవురా?'' కిట్టయ్య బీడికొస దులుపుకుంట గదమాయించిండు.

''గట్లంటె ట్ల [35] బాంచెన్. పొద్దట్నుంచి నోట్లె మంచినీళ్ల పొయ్యకుంట తిరుగుతనే ఉంటి ... సేన్లకాడికి పోయినోల్ల, గుంటుకు లకు [36] పోయినోల్ల - జపుసేసెటందుకు గింతసేపు పట్టె ... ఆడికి చిందొర ఇంక తానము సేయలేదని'' సుంకరి నర్సిమ్మడు దూరంగ జరిగి జనుకుకుంట అన్నడు.

---

33. ఎడమవైపు 34. మొనదేలిన 35. అలాఅంటె ఎలా
36. పొలం చదును పనికి

''నీ అంతుకు మేమే సుంకరితనము సేత్తముగని పల్లెమీనిపెద్దొర దగ్గరకెల్లి జెప్పన[37] పిలుసుకురా...'' నర్సయ్య హుకుంజారీ చేసిండు.

నర్సిమ్మడు దొరోరి ఇంటికెల్లి ఉరికిండు...

"దొరెచ్చేటల్లాకు మీ సంగతేందో సెప్పుర్రా మాదుగులు...'' పోశాలు.

''మీ కెరుకలేందా బాంచెన్?.,.'' పిచ్చిలగట్టడు గునిసిండు.

''ఎరికేరా? నాకొక్కని కెరుకే? నాకొక్కని కెరుకుంటెమాత్రం! కాకుంటె ఈమందిలో నర్సిమ్మని కెరుకుండచ్చు...కాదురానర్సిమ్మా?'' నర్సయ్యతోని పోశాలు అన్నడు.

''అదికాదు పోశాలు...,'' మజ్జెలో తుపుక్కున ఊంచి ''మన కెరుకుంటె ఎరుకున్నది గని ఇక్కడ కూకున్న నలుగురు ఇనాలెగద? నలుగురున్నకాడ నారాయుడున్నడు. అందరేమంటరో?.....మందికెల్లి సూసిండు నర్సయ్య.

''మీరంటె ఇక్కడ ఎవ్వల కెక్కువ తెలుత్తది?'' లసుమయ్య నడిమందిలనుంచి అన్నడు.

నర్సయ్య నలుగురిజోలి తీసింది ఈ మాట కోసమే.

''ఎట్లయిన మాదిగ లంజకొడుకులకు కావురమచ్చిందిగని, కండ్లునెత్తిమీని కెక్కినయ్ — మొన్నటికిమొన్న అయ్యగారి బాయికి

37. వెంటనే.

నీళ్ళు సేదుకొంటమని గుజి కట్టుకొని అచ్చిన్రు. అవ్వల మిండల పొమ్మయినట్టు" ఓడెలు మాదిగోల్ల మీని అక్కసంత ఎల్లగక్కిండు.

"బాంచెన్ గులాపోల్లము [38] ... ఇన్నేండ్లబట్టి మీ బాయికి నీల్ల కచ్చినమా? బూరుగాగు [39] బొబ్బలు కొట్టినా—మంచినీళ్ళేక సచ్చినమ్‌గని; అడ్లు, మురుకులు గలికితిమి. మీకండ్ల ముంగట్నె బూరుగాగంత ఇయ్యేడు ఎండిపోయింది గదున్రి...ఆనదేవుడు మంచె ...ఏడ సావుమంటరు? బాంచెన్. సర్కార్ కట్టిచ్చి గిరుక[40]లేసిన్రని నీల్లకత్తిమి...ముందుగాల నీపెండ్లాం పియిదింట – లసుమవ్వను సేదె దన్ని నీళ్ళమొయ్య మంటెతండ్రి కయ్యకేర్గె [41] గులాపోల్లము మేము గిరుకకు సేదు కుంటమంటె—దుడ్లు తీస్కచ్చి ఈపులన్ని మెతిపితిరి. ఆకరికి అరిమడ్లల్ల[42] పొక్కదోడు కుంటిమి... నీ బాంచెన్ గసొంటి[43] కరువు కాలాలొత్తే ఏడ పోదుము." సమ్మడు తమదేమి తప్పుగాదని నచ్చసెప్ప సూసిండు.

"అదంటె పోనియ్యి—బొత్తకొంటని బలుపు మదము గాకేంది— ఆదే దొంగతనము జేత్తడు. ఎందుకు జేసినవ్‌రా?' అంటె ''కడుపు గాలి'' అంటడు దొరోరు నీరటిబిచ్చం ఎగ బెట్టడా మరి? కాపురంకొద్ది అడ్లకచ్చులాల[44] కద్దంబోయి కనాలూడదీకి [45] 'బిచ్చం బెట్టే దనుక కచ్చులాల కదులనియ్య' నంటడు... ఈడు లేసినేల్లమంచిది. దొరోరు ఏకాల్లి[46] లున్నరో కర్నెకోల కట్టందుకొని పిల్లిని పొడిసినట్టుపొడిసోసె టోరే—ఈపు మెతిపి ఇడిసిపెట్టిన్రు-ఆడికి దొరే దమ్మ మింగిండు—

---

38. గులాములము 39. బూరుగు అనువాగు 40. గిలక 41. తిట్టెను 42. వరిమళ్ళలో 43. అటువంటి 44. కచ్చురం (బండి) 45. ఎడ్లను కాడికిబిగించి వుంచే కర్రలు. 46. ఆలోచన.

తెల్లారి పంచాతుకు పిలుత్తే 'ఏదో బాంచెన్ ఇన్ని కల్‌నీల్లుదాగినంటడు'- గిన్ని సేసినంక ఇగమాదిగోళ్ళకు నీరటి బిచ్చం ఎట్లాపెడుతరు?'' ఓదెలు తుపుక్కున ఊంచి ''మాదిగ లంజకొడుకులు పాపమన వశమా?'' అని తేల్చేసిండు.

మాలి పటేలు మాదవరెడ్డి బీడి కాల్చుకుంట అచ్చిండు.

మాదిగోల్లంత లేసి నిలుసుండి దండాలు పెట్టిరు. గుంపుల నుండి ఒకడురికి ఎవ్వలనో గడెంచడుకచ్చి దొరకేసిండు.

దొర గడెంచలో కూకున్నడు.

''ఇంక పెద్దొర రాలే ... నర్సిమ్మ దేడబోయిండు ...'' బీడి మొక్కని ఇసిరేసి అన్నడు.

''ఆడికే తోలించన ముర్రి'' పోశాలు సదురుకొని కూకుండి అన్నడు...

''తొంట కొంరని కొడుకు లింగడు-కర్రెలింగడు అచ్చిర్నా?'' మాదుగులకెల్లి సూసుకుంట అన్నడు.

''అచ్చినమ్...బాంచెన్...'' జెరముంగటికచ్చి కూకున్నరు.

''బొత్తకొంరదేడి!'' దొర.

భూలచ్చిమి ఎనక కూరుకుతున్న కొంరన్ని ప్రక్కకున్న పెద్ది గాడు లేపిండు... ఉలికిపడి ''ఓయ్...'' అన్నాడు ఆదురుదగ.

''బంచెత్...ఓ యేందిరా? బామ్మరిది నన్నట్టు! పెద్దమనుసుల్ని పంచాతికి పిల్చి నిదురపోతున్నవ? సువ్వర్! [47] ..." మాలిపటేల్ మాధవరెడ్డి.

''నీ కాలు మొకుత బాంచెన్–నాత్రి నిదురలేదు. కల్లం [48] కాడ కావలున్న.'' కొంరెడు.

''పంచాతేందిరా?..," కొంరని తోని దొర.

దొరోరి కుంటక్రింద తను నీరటి తనము సేసిన కాన్నుంచి సివరిదనుక సెప్పుకచ్చిండు కొంరెడు.

ఇంతట్లకే మొఖం ఏల్లాడేసుకొని అచ్చిండు-దొరోరి ఇంటి కెల్లినసుంకరి నర్సిమ్మడు.

"ఏమాయెర నర్సిమ్మా! దొరేమన్నడు?...." పోశాలు.

"నీ కాలు మొకుత పటేలా! గియ్యాల్ల [49] కాపోల్లు, పెరోకోల్లు పంచాతి సెప్పేటోల్లయింద్రా? ఆల్లకాడికి నేనురావన్నా అనుకుంట – మీది కురికచ్చింద్రు బాంచెన్..." నర్సిమ్మడు అసలు సంగతి తేల్సిండు.

కాసేపు ఎవ్వలు మాట్లాడలేదు.

''దొర రాకుంటె ఈడ ఆగేదేమున్నదిగనుక? నర్సయ్యా! పోశాలు! ఈల్లపంచాతి మనమే తెంపుదాం..." మాలి పటేల్ మళ్ళో బీడి ముట్టించిండు.

---

47 పంది (తిట్టు) 48. కోసినపంట 49. ఇవ్వాళ

పోశాలు, నర్సయ్యలేగాదు అడున్న ఎవ్వలకు దొరోరు లేకుంట పంచాతెట్ల తెగుద్దో సమ్దు[50] గాలె. ఒకరి ముఖా లొకరు సూసు కున్నరు.

"దొర పొలంల దొంగతనము సేయటం కాన్నుంచి దొర బండ్ల నటకాయించడం దాక బొత్తకొంరందే తప్పుగద. ఈల్ల నీరటి బిచ్చెము ఎగబెట్టటాన్కి గుడుక ఈడె కారణంగద — ఏమంటరు పోశాలు? నర్సయ్యా? ..." రెడ్డి పెద్దపెద్ద మనుసులిద్దరిని ఇరకాటంలో పెట్టిండు.

"అదిగాద్దొర..." నర్సయ్య ఏదో అడ్డుసెప్ప బోయిండు.

బొత్తకొంరని ముఖంల నెత్తురుసుక్కలేదు.

"ఏదిగాదయ్యా! సాలుసెప్పు ధర్మరాజ అంటె దుడ్డె, బర్రె నాదే నన్నడట ఎనకట..."

సాలు సెప్పేదెవ్వలో? దుడ్డె, బర్రె ఎవ్వలదో సమజ్‌గాక నర్సయ్య, పోశాలు బిక్కమొఖం ఏసిర్రు.

ఓదెలు దొరవాలుకం కనిపెట్టి "దొరోరు అనేటిదేందంటె బొత్త కొంరడు, కర్రె లింగడు, తొంటకొంరని కొడుకు లింగడు కలిసి పంచాతి తెంపుకోవాలె. అంతేగాదురి దొరా?" సాగదీసిండు.

"అగ్గది...ఓదెలు నువ్వు సరిగ్గా తెలుకున్నవోయ్" మాలి పటేల్ ఓదెలును మెచ్చుకున్నడు.

---

50. అర్థం.

''దొరయ్యకుంటె నేనేం జెయ్యాలె బాంచెన్...'' బొయిల నుంచి మాట్లాడినట్టు బొంగురుబోయిన గొంతుతోటి అన్నడు కొంరడు.

''ద్దెత్తెరి ... పెద్ద లోకులంతుంగట నువ్వేం మాట్లాడ్తన్నవు... అల్లకెరుకలేదా?...'' పోశమల్లు దొరకు కోపమొత్తదేమొనని కొంరన్ని కసిరిండు.

"లంజకొడుక... నీ పెండ్లాన్ని "— ..." నేనేం జెయ్యాలంటున్నవ? సెప్పుబట్టి పండ్లూడగొడుత-నువ్వు జెయ్యంగ కాదుదొర కోపాని కచ్చిందిఎ?'' మాలిపటేల్ దొరోళినెనుకేసుకొని ఉరిమిండు.

కొంరని శరీరం కుతకుత ఉడికింది...

''కోపానికి రాకుర్రిబోరి... పంచాతిసేద్దాం...'' నరసయ్య నసిగిండు.

సెప్పుమన్నట్లు మాలిపటేలు ఓదెలుకు కన్నుగీటిండు.

''మాదిగలంజకొడుకులాలా! నెరో యాభైరూపాలు దడావతు[51] పెట్టుర్రి పంచాతి నడుత్తది.'' అసలు విషయం తేల్చిండు.

''నీ బాంచెన్—సంకలేవడితె కార్జముగన్పత్తది. పెయ్యంత గొడితె పెరుక్కు పెద్దకొత్తెల్లది. ముచ్చిలుకలకు [52] యాభైరూపా లెక్కడ తెత్తముర్రి?'' తొంటకొంరని కొడుకు లింగడు భయంగ అన్నడు.

---

51. పూచీ 52. ఒప్పందం రాసి యిచ్చుటకు

''ముచ్చిలుకలు లేంది పంచాతెట్ల నడుస్తది? అయితె మీకు మీరే సేసుకోండి, మజ్జెన మమ్ములెన్నెందుకు పిలిసిన్రు?'' — మాలి పటేల్ లేచినిలబడ్డడు.

''కూకోన్రి... యాభై అంటే ఈఅగ్గెనగాల్ల [53] మాదిగ లంజ కొడుకు లెక్కడదెత్తరు? ఏదో నలభై కాడికి సేద్దాం'' — పోశాలు రాజి కుదురుతున్నట్టన్నడు.

మాదిగోళ్ళు మాట్లాడే గుండెలులేక కూకున్నరు. ఈ ఊళ్ళె దడావతు లేకుంట పంచాతి జర్గడం ఆళ్ళేగాదు ఆళ్ళ తాత ముత్తాతలు గుడుక సూల్లే.

''ఏమంటవుర కొంరె పోశాలేమొ అంటడు?'' ఓదెలు.

కొంరడు బిర్ర బిగుసుక పోయిండు.

''సరే! కొంరడొప్పుకున్నడు. మీరేమంటర్రా?'' ఇద్దరు లింగల్లతోటి ఓదెలు.

''బాంచెన్...'' కర్రె లింగడు నసిగిండు.

''బాంచెన్ లేదు... గీంచెన్ లేదు...నగతుదెత్తరా? మనసుల్నొప్పిచ్చుకుంటర?'' ఓదెలు.

''గొడ్డు బొక్కలు దినే మాదిగోళ్ళకు నగతులా?...'' ఆడోల్ల గుంపులనుంచి కొంరని పెండ్లం మల్లి ఉండబట్టలేక అన్నది.

---

53. ఉన్నపళంగా

''లంజెకాన! నిన్నెవడు పిలిసిండు? ఈన్నుంచిపో – రాజ్జా లేలుతర? పంచాతి కాడికచ్చిన్రు...'' సర్పంచ్ కోమటి కిట్టయ్య మల్లిని బూతులుతిట్టిండు...

''అవ్వో!...నీ బాంచెనాతే!...రాజ్జాలేలుతమట! రాజ్జాలు!...'' గునిసిసాటుకు జరిగింది.

''ఏంరా కొంరఁ?'' ఓదెలు మల్లడిగిండు.

''పోశయ్య పటేలా! ఒప్పుకోన్రి బాంచెన్—'' కొంరఁడు దీనంగా మందిలనుంచి పోశాలు కెల్లి సేతులు జోడించిండు.

''నేను మజ్జెన పడనుర – మాదిగికుక్కలము మంచిదిగాదు'' పోశాలు అనికెల్లి సూడకుంటనె సెయి ఊపిండు.

''నీ పెండ్లం పియిదింట-మీరు కాదంటె ట్ల? బాంచెన్'' కొంరఁడు బతిమిలాడంగ ఆఖరికి ఒప్పుకున్నడు పోశాలు.

లింగలిద్దరి తరపున నర్సయ్య జమానతు [54] పడ్డడు

పొద్దు పడమటి కొండల్లకు పోయెదనుక! కంచెల్లకు బోయిన పసురాలు ఊళ్లెకు చేరే దనుక: ఆకులు రాలిన ఏపసెట్టు మీనికి పచ్చులు సేరుకునే దనుక; మర్లేసి, తిర్లేసి, తిట్టి, కసిరి, నాన్చి ఆఖరుకు బొత్త కొంరందితప్పు జేసిన్రు. కొంరఁడు తప్పు దండుగు కింద, ఇయ్యేటి సీరటి బిచ్చెము మూడుగిద్దెలు లింగల్లిద్దరికి కొలువటమే కాకుంట, నలుభై రూపాలు దడావతు కూడ పటేలుకియ్యదేలిండు.

---

54 పూచీ

అంతవరదాక నోట్లె మంచినీల్లన్న బొయ్యని కొంరని కండ్లు బైర్లు కమ్మినయ్.... రెండు నిముషాలకు తేరుకుని "పిల్లలు గల్లోన్ని బాంచెన్ దొరా! ఈడికే పూటగడుత్తలేదు. నన్నన్యాయం సేయకండి- బాంచెన్ దొరా! చెట్టెత్తు మనిషి బోరుబోరున ఏడుసుకుంట మాలిపటేల్ కాల్లకు దూరంగా దుమ్ముల కూలబడిపోయిండు.

మాలి పటేల్ పోశాలు దగ్గర నలభై రూపాలు తీస్కొని అని మొఖమన్న సూడకుంట ఇంటికెల్లి నడిసిండు.

"కొంరా...ఐతార[55] మొచ్చెటాల్లకు నలుభై రూపాలు పట్టు కర్రా!" పోశాలు ఎల్లిండు.

ఎవరితొవ్వల వాల్లే ఎల్లిపోయిండ్రు....కొంరనికి లేవానికి శక్తి సాలలే దుమ్ములకూకుండి పోయిండు...గొడ్లు, బర్రు బజారులో దుమ్ము లేపుకుంట ఎల్లిపోయినయ్. వాని శరీరమంత దుమ్ము నిండింది.... వాని బతుకులగుడుక దుమ్ము నిండింది....

సందె చీకట్లు పడుతున్నయ్- చిమ్మెట్లు పలుకుతున్నయ్.... కొట్టాలల్లకు సేరుకున్న వసురాలు దుడ్డెల్ను, లేగల్ను సూసుకొని మురిసి పోతు ఒర్లుతున్నయ్...

మెల్లెగ లేచి నిలబడ్డడు... మూడు పానాదులను ఒక్కసారి కలెసూసిండు...ఈన్నే ఆళ్ళంతకూకుంది తనబతుకుల సీకటినింపిండ్రు... చీకట్లో బూలచ్చిమి సెక్కబొమ్మలు...సీకటి....బొసు సీకటి—మొత్తం ఊళ్ళంత సీకటే...

55 ఆదివారం

''అవ్వా-మావ్వా... బువ్వేయిర్రి''.,. ఎవ్వలింట్లనో పోరగాడు అరుత్తండు నోరుసించుకొని...

''అని బతుకేనయం...'' మల్ల కలెజూసిండు: ''ఈ వాడ పొంట[56] బోతె పెరుకోల్లవాడ. ఈ వాడ కాపోల్లది. మరి ఈవాడో,.. కుమ్మర్లు, కమ్మర్లు, అక్లోల్లు[57] మొత్తం ఇండ్లన్ని పనోల్లయె. ఇంక కిందికి బోతె నరకం గప్పులు[58] కొట్టె మురిగిపోయిన మాంసము, పైన ఎగురుతున్న పీతిరి గద్దలు...బొక్కలు కుక్కలు...ఛీ—ఛీ...ఇట్ల ఇప్పుడు ఇంటికి బోతె పోరగండ్లకు, మల్లికి ఏ మొఖం సూయించాలె? అయితె ఎటుపోవాలె ... సర్పంచ్ కిట్టయ్య.

''మెరుపసోంటి ఆలోచన ... తనోక్కోటు తక్కువుంటె- కాదు—కాదు, తన ఓటుతోనె గెలుసిండుగద - ఈ కట్టకాలముల ఆదు కోడ? తప్పకుంట ఆదుకుంటడుగని'-కాళ్ళీడుసుకుంట కాపోల్ల వాడకెల్లి నడిసిండు.

గిదే-ఇదే పోశాలిల్లు..., ముంగట పెద్దరువాజ సుట్టు పదారి[59] గోడ-లోపట సెన్నపెట్టికట్టిన నాలుగిండ్లు — ఈ ఇండ్లకు సున్నం డంగు కొట్టి సేతులు కాయలుగాసి పోయినయ్ — సేతులకెల్లి సూసు కున్నడు... సేతులుకాయలుగాసి మోటువారి పోయినయ్. సున్నండబ్బ మోత్తె నెత్తిమీని ఎంటికలు ఊసిపోయినయ్. నెత్తిపునికి సూసుకు న్నడు-నున్నగ తగిలింది ..., ఉపాసముండి, ఉప్పిడుండి బండలు మోసి ఇండ్లు కట్టినమ్... సివరకు నలబై రూపాలొప్పుకోలే—

---

56 వెంట 57 వడ్రంగులు 58 కంపు 59 పదారి (ప్రహారీ)

నన్ను పాలేరుంచుకొని నాలుగేండ్ల దనుక పెట్టుబడి పెట్టలే - సిన్నకుండపెట్టి తాలు తప్ప గొలుసిండు... అంతా తోడుదొంగలు. సెప్పుకుంటె ఇనెటోల్లెవ్వలు... గన్ని పనులుచేత్తే బొర్రోడు... పోసిగాడు అయితారం పైసలు గట్టుమన్నడు ... కుక్కలు నయం మాడి సెక్కటొక్కచేత్తే ఆజల్మాంతము[60] మరిసిపోవు... ఈడు మాదిగోదైతెనా? లంజకొడుకును బొత్తవలుగ్గొట్టి జేలుకుబోదును. ఆర్నెల్లంటే... పెద్ద లోకులు ఏంజేసిన సెల్లుతది... రాజ్జెం ఆళ్ళదేమరి!

పోశాలిల్లు దాటిండు ... ఓదెలెల్లు అచ్చింది. గీడు-గీ బట్టెబాజి [61] ఓదిగాడు... తినబోతె తిండికిలేని గీ లంజకొడుకు దొరోరి మోసెయికింది నీల్లుతాగే గీ బద్దుమాసి ... దొరోరిమాటలకు తాళాలు కొట్టిండు. ఈనికి నేనేం పాపం జేసిన? ఈని బిడ్డను మారుమానపు[62] మొగడు ఇగ్గుకపోతంటె అడ్డందిరిగి సమ్జాయించి కాపురం నిలబెట్టిన్నే!... అందుకనే ఈని గుడిసెపందులు గుడిసెను మించి పోత లేదు. తాడెక్కటో దొకడుంటె తలతన్నెటో దొకడుండడు మరి! ... ఆడు తనినెత్తి బుడుతడు కొడితె బుడతని నెత్తి బోడోడు గొట్టిండంట! దొర అనకముందే ఈడు ఎగిరెగిరి జుట్టు పిట్ట వగుతుగ .... పిడికిల్లు బిగుసుకున్నయ్.

ఓదెలిల్లు దాటిండు....లసుమయ్య ఇల్లు అచ్చింది....గీ చింగెం లసుమయ్య పెండ్లం దావఖాం [63] ల్లుంటె .... నాత్రి పగలు ఆనికి తోడుగా ఉండి ఏదిగావాలంటె అది సేసిపెత్తినే! ఒక్కమాట .... ''ఆనిది తప్పుగాదని''-అంటె—ఈని ముల్లె మునిగి పోయిందా? ఛత్! బంచెత్! లంగలోకం!.... బట్టె మాజి మనుసులు!

---

60 బతికినంతకాలం (61 తిట్టుమాట) 62 మారుమనువు 63 ఆసుపత్రి

ఇంతట్ల సందుల దీపాలెలిగినయ్ .... సీకట్ల నడుస్తున్న కొంరని కండ్లకు ఒక్కసారిగ ఎలుగు కన్పించేటాల్లకు కండ్లు కన్పడలే....గీ సర్పంచి కిట్టడు, నర్సడు, పోసిగాడు బట్టెబాజులంతా — ఏదో ఒరుగ పెత్తదని కంబాలు [64] లేవట్టుసుకు, పొక్కలు తోడనుకు తీగెలిగ్గెటందుకు పుణ్కానికి [65] తీస్కపోయిర్రు....ఆకలితోపైన పోయినమ్....సవ్వల్ల మీన [66] దీని తస్సదియ్య పుర్రసెయిమట్టమీన కంబముబడి అయిదు రోజులు వాత్తే నా పోరగండ్లు ఉపాసమున్నరు. బాయిలకాడ ఇంజన్లు పెట్టుకున్నరు - ఇంటిముంగిల తలోటిబుగ్గలు [67] పెట్టిచ్చుకున్నరు.... ఇండ్లల్లకు తీసుకున్నరు....కోమటోడు పెండ్లాం, పోరగండ్లు ఏరగ బోతరని, ఆగుకెల్లి సేన్ల మందిలేనికాడ, ఇండ్లులేనికాడ బుగ్గపెట్టి చ్చిండు! పెద్దమ్మ గుడికాడోటి, గూడెంలోటి సెట్టాల్నని ఎంత మొత్తు కున్నా?..ఆడెవడొ ముక్కెమంతిరచ్చిండంటే కూడుదినకుంట సర్పంచ్ గాడు తీసుకపోతే....రోడ్డేపిచ్చిసన్నడు!.... అయ్యెవ్వనికి కూడు పెట్టి నయ్? ఆళ్లేరానుపోను మోటార్లల్ల తిరిగెటాన్కి బనికత్తన్నయి.... ఎక్కన్నో అడివిల బిర్జి [63] కట్టించిండట!....ఏంజేసుకోను బిర్జి? ఇంకేం దేందో సేసిండట .... ఎక్కడ కన్పించలే! కరెంటచ్చిందని ఆడు సెప్పితే మతికచ్చి కోటక్కపజలో నేనొక్కన్ని నిలుసుండి అడుగుతె అందరు నవ్వంగ ఆడునవ్వి ఏయిత్తనన్నడు....ఆఖరికత్తె పెద్దమ్మ గుడికాడ ఒక్కకంబమేసి దానికి బుగ్గ బెడితె రొండ్రోజులెలిగి తప్పు మని ఉడాయించింది....

ఈల్లు సేసెడిదంత నాయమంట! నేనుసేసింది అన్నాయంఅట! ఔనుమరి! బిచ్చాలెగ బెట్టుడు, సాకల్దాన్ని గుంజుడు సీ సీ, అయ్యన్ని నాయం!.... నేను సేసింది అన్నాయం!

---

64 స్తంభాలు 65 పుణ్యానికి 66 చవుడునేలలపై 68 బల్బులు 69 బ్రిడి

నేనేంజేసిన? యాడాదిపొడుగూత ఉపాసముప్పిడుండి ఆని పొలాన్ని కంటికి రెప్పోలె కాపుకాత్తె-దొరగాడు అడ్లగింజలు పొలం గోసినంక ఇత్తనంటె-అంతదాక ఎట్ల బతుకాలె? అడిగడిగి నోరు నొచ్చె-పోరగండ్లు ఆకటికి మాడిసచ్చె కాలమచ్చె.

ఆనాడు సిన్నోడు.... నా పానం [69] నా సిన్నకొడుకు మల్లిగాడు జెరమొచ్చి 'అయ్య ఆకలి' అని ఆ సిన్న సేతులతోటి ఈడుసుక పోతన్న కడుపు సూపిత్తె తనపానం సుమ్మర్లు సుట్టుక పోయి-ఆని పొలంల అదీ ఆరుగాలము కట్టముజేసి పెంచిన పొలంల ఇంత మెద[70] పాలేరు సూడంగ దెచ్చుకొని నలుసుకొని గంజి గాసు కొనుడు దొంగతనమా?

ఆ మాట కత్తె నాసింత మీని సింతకాయ - ఇంటికాడెవ్వలు లేకుంట సూసి పాలేర్లతోని ఇత్తుకు లేకుంట తెంపుకబోతె దొరతనమా?

ఆడంటె అట్ల నా కడుపుమీన కొట్టిండనుకుంటె-ఈడు ఈమాలి పటేలోడు-ఏందేందో అదిరి [71] ఆఖరి కత్తె నా దగ్గెర తప్పు దండుగ తీసుకుంటడ?

నాయం....నాయం .... నాయం తల్దెం — ఖరాఖండి మాట్లాడ్తె కట్టుబోతనిరి .... మాదిగిలంజకొడుకులంత ఆళ్ళు తన్నినా పెండ్లాల నిగ్గినా—ఆళ్ళదిక్కే పలుకుతురు — సివరకత్తె అగ్గి, నీల్లు బందు జేత్తరు....ఊల్లంత పుండుమీని ఈపులు కాకుంటె పురుగులు....

పప్పంచ్ కిట్టయ్యఇల్లుదాటి పోయిండు. కొంరడు ఇచారించు కుంట .... జల్ది గుర్తొచ్చి ఎనక్కు తిరిగిండు.

---

69 ప్రాణం 70 ధాన్యపు కట్ట 71 అరచి

కిట్టయ్య పెద్దరువాజ ముంగట నిలుసుండి ''పటేలా .... ఓ పటేలా....'' గట్టిగా పిలిసిండు.

''ఎవఁరా ఏల్ల-పాల్ల లేకుంట....'' లోపలికెల్లి పర్వంచ్‌ను సాదుకున్న తల్లి బయట కచ్చింది....

''నేనవ్వా బాంచెన్ ....'' కొంరడు ఇప్పటి ఆలోచనలన్నీ మరిసిపోయి నసిగిండు మల్ల పాత కొంరని తీర్గ

''ఏందిరః కుక్కలకొడుక! .... పటేలుకేం దెచ్చినవ్ ఇంత నాత్రిః'' ముఖం పేలాల పెంకోలె మాడుసుకొని కసిరింది....

'బానే....గరీబోన్ని ఏంతెత్తః....తెచ్చిచ్చి, తెచ్చిచ్చి, సిప్పచేతి కచ్చింది....నీ మొగడు పచ్చవాతంల పడితె ఆని మంచము బఁరె మట్టి కాడేత్తె ఆని పియ్యి, ఉచ్చ ఎత్తిపోసేటప్పుడు ఏం పట్టుకచ్చినః'.... కొంరని మనుసుల పురుగు తొలుత్తంది.

''సిన్న పని బాంచెన్....'' పాతకొంరడు.

బూతుమాటలు తిట్టుకుంట లోపలికి పోయింది,

కాసంత సేపటికి బుఁరపంచె మీదేసుకొని జంజరం తీడుకుంట అచ్చిండు కిట్టయ్య....

'బొఁర పెరిగింది....ఊగుతంది .... పెరుగదిమరి! రూపాయి తీసొకని నాలుగు మిరపకాయలు, పిరికెడు ఉప్పు, చెవులేసుకునేటంత నూనెపోసి మిగిలించంత తిని బొఁర పెరిగింది....' కొత్త కొంరడు ఒకచేలొల్లి పెడుతండు.

''ఏందిరా కొంరః .... అద్దుమనాత్రి! ....'' కనుబొమ్మలు ముడిసి కసిరిండు కిట్టయ్య.

"ఏంలేదు బాంచెన్ .... గ నలుబై రూపాలు ....'' కొంరని గుండెలకెల్లి మిగతా మాటలు బయటపడలే.

''రూపాలెక్కడున్నయిరా? అయ్యవ్వదాస [72] పెట్టిన్రా. ఏయేల్ల బడితె ఆ ఏల్ల బదలిచ్చేటాన్కి?'' కిష్టయ్య ఎనక్కు తిరిగిండు.

"నీ బాంచెన్ .... గట్లంపెట్ల? ....మీరియ్యకుంటె ఎవ్వలిత్తరు? ముంగటికి నీ బాంచెన్ .... కాటికి కావలుండైన, నీ కాళ్ళకాడ బతికైన అడ్డీ [73] తో నీ రూపాలు పూలల్లబెట్టి ఇత్త బాంచెను" నాలుగుసార్లు గడుపకు మొక్కిండు.

''ఏంజూసియ్యాలె? ....అదె ఆవో, లేగో అమ్మరాదు? .... అంత లావయితె....'' కిట్టయ్యకు కొంరని బుల్లావుమీన కన్నుపడ్డది.... ఓట్ల ప్పుడు అనవుసరంగ దానికోసం కచ్చేదు గడ్డి ఇయ్యాలినచ్చింది.

కొంరని గుండెల్ల బల్లెం గుచ్చినట్టయింది .... మాట గుడుక పెకల్లే ''అయితారము తెచ్చియి'' పోశాలు హెచ్చరిక. మూడుగిద్దెల అడ్లు లింగలిద్దరికి కొలువాలె .... మల్లిడూకుంటదా? తనమామ మల్లి తోడుత అన్న [74] మిత్తె అమ్మంగ, అమ్మంగ మిగిలిన ఆవు. ఆకలయి ఏడిసే పోరగండ్లకు గుక్కెడు పాలిచ్చే ఆవు .... కొంరని మనసు సుమ్మర్లు సుట్టుకపోతంది....

---

72 దాచి 73 వడ్డీ 74 కట్నం

కిట్టయ్య లోపలకు పోతండు....కొంరని కేం సేయల్నొ తెలువలె. మీన సందిల దీపం ఎలుగుతంది....తనసేతుల మీన పెరిగిన కోల్లాగెల తప్పేడు తప్పేడు పాలిచ్చె గొడ్లను ఈనికె ఇచ్చిన. అయిన ఈనికి కడుపునిండలే–ఉన్నొక్కకోంద్ర గుడుక ఈని కొన్నేమ్మ పెట్టిన ....

కోంద్రం౦టె మతికచ్చింది..చెవులఉన్న సగంకాలిన సుట్టముక్కి-తీసుకున్నడు. జెకముక కొట్టుకొని సుట్ట అంటించుకొని గుప్పు గుప్పున రెండు దమ్ములిగ్గిండు....ఆడు ఇంటి ఇసియం, గొడ్డు ఇసియం మరిసిపోయిండు.

''ఔను, గుడిమెట్టు బాపవపొంట....లైసు గొట్టినకాడ సెలు కుండె....గడ్డలంపులు సమానం సేత్తె....అది పరంపోగే[75] నాయె, నీ యక్క; ఆ యింత కొమ్మగొట్ట బొట్టుకుని కట్టబడితె .... ఇంత బాయిపొక్కతోడ్కుంటె.... అరేదెకరాలు పెండైతది, నీ యవ్వ! దీని తల్దెం....! ఈ దొరోల్ల జీలి గీలి ఏముండదు''.

సందుల దీపం రెండుమాట్లు కొట్టుకొని తప్పుమన్నది..

కిట్టయ్య తిని బయటికెల్లి, కంబము మొదట్ల అగ్గిని సూసి —

''ఎవ్వరా?....'' గద్దరాయించిండు.

''బాంచెన్–కొంరన్ని...." లేసి కిట్టయ్య ముంగటి కచ్చిండు–సుట్ట మలిపి చెవుసందుల పెట్టుకొని.

''ఇంకీడ ఏంజేత్తన్నవ్‌రా?" కిట్టయ్య.

---

75 పోరంబోకు

''ఇసారించుకుంటున్న–బాంచెన్, గొడ్డును లేగనెంతకు దీసుకుంటరు? బాంచెన్....'' కొంరడు.

''ఏమియ్యల్రా? గొడ్డు మూడీతలది. ఏంబెట్టినా లేగకే....''

'కోమటోని బేరం. ఉప్పో, పప్పో ఇత్తడు కావచ్చు' మనుసుల కొంరడు. పైకి – ''గొడ్డు ముసల్దా! బాంచెన్ – మీరు సూత్తినే సూత్తిరి, మూడరుసోల్ల పాలిత్తది, మీ దగ్గరనైతే తవ్వెన్నరుసోడిత్తది. అడుగరాదుర్రి బాంచెన్....''

"మూడుగిద్దెల అడ్లు – నలభై రూపాలు గిత్తయాను[77] రా?.... నువ్వే సెప్పు....?'' కిట్టయ్య....

కొంరనికి శలీరం మండించి .... ఏంజేత్తడు? "గాయింతేన? బాంచెన్....ఆరేడు నూర్లు పెడ్తరు కోల్లాగెకె ఇంక రెండేండ్లకు''.

మరో ముప్పయిత్త నీ యిట్టము....కిట్టయ్య ఎనుకకు తిరిగిండు లోపలకు పోయెటాన్కి.

'మల్లి....పోరగండ్లు.... నలుబై రూపాలు-మూడుగిద్దెల అడ్లు.... తన పానం ఆవు'....తోడుదొంగలు ఇంతకన్న ఎవ్వడెక్కువియ్యడు.

''సరె బాంచెన్....పొద్దుగాలొత్త....'' కొంరడు.

మాట పక్కేన?[77]....కిట్టయ్య హెచ్చరించి లోపలకు నడిసిండు.

కొంరడు గూడెంకెల్లి నడిసిండు.

---

76 గిట్టుబాటు అవుతయా? 77 ఖచ్చితమేనా?

పీ, సీ....ఎక్కువోల్లంత లంగలు! నాయంలేదు! లమిడికొడుకులు, నేనేమొ రెక్కలు, బొక్కలు, కళకళమనంగ కట్టబడాలె! ఆళ్ళేమొ మనమీన సవారు సేయాలే! యాడున్నది నాయం?

ఏందోగని ఈదేవునికి గుడుక నాయం తెలువనట్టున్నదెహేఁ! కాకపోతె—మంధిని ముంచెటోల్లకె-మేలుసేత్తడు. ఈడుగుడుక లంచాలోదే ఉన్నట్టున్నది!

అన్నట్టు సప్పంచ్ గానితోటి మంథెన్లకు పోతె ఆదెవ్వడో ఆనాడురాత్రి సబసెప్పి దేవుడు లేడన్నడు. అని మాట నిచ్ఛమే[78] నని పిత్తంది. అనికేమెరుక? సోరోడనుకున్న - నిచ్చంగ దేవుడుంటే ఎందుకు సూత్తలేదెహేఁ? గింత అన్నాయం జరుగంగ ఆడు కల్లు మండువకాడ కడుపుబ్బ తాగినోన్కి పపంచము బట్టనట్టెందుకూకుంటడు. నల్లగొండ సాత్తుర్లు కిట్టావతారం సెప్పినప్పుడు వడితె అప్పుడు అచ్చి పాండవుల ఆదుకున్నడె....మాల్లె కిట్టడు పాండవులకత సెప్పిండు దర్మరాజుకు గిట్లనే కట్టాలు తప్పలే—కిట్టమూరితి అచ్చిండు. మరి ఈదేడి?....

పోశమ్మకు గొలిసేటప్పుడు ఘటమెత్తుకొని, 'బలో బల'ని లెల్లాయిపాట పాడుకుంట పోతంటె పంబాల దుర్గన్న 'శగితి ఆగ బట్టిందిరా'' అని కేకపెట్టి కోడిపిల్ల లెగిరేయాలె అన్నడు ఉత్త దెందుకయిద్ది? దెహేఁ! అని తపాసె మల్లె మొఖానికి మంత్రాలత్తయ—అని ఎద్దు కడుపుబ్బి పెటేల్మనచ్చింది. ఏలుపమ్మ పట్టిందని ఆదే అన్నడు జువ్వి కిందకొత్తె కారుమబ్బు లేసి సచ్చిందని తెలిసింది.

---

78 నిజమే

అంత అట్టిదె! దేవుడు లేడు—దయ్యం లేదు. బయపెట్టడాన్కె గని....

పల్లె దాటిండు....పిల్లగాలి మురుగు వాసన మోసుక పోతంది. కొంరనికి సీకట్ల మాదిగోల్ల గుడిసలు దయ్యాల వవుతుగ అగుపించినయ్. పల్లెకెల్లి సూసిండు సందు దీపాలు ఎలుగుతున్నయి. మాదిగి గుడిసెల సూత్తె రోతపుట్టింది. కొంరనికి మాదిగ గూడెం అవుతల నక్కలు కూత్తన్నయి. జువ్వి సెట్టుకింద కుక్క ఒక్కతె కూకొని ఏడుత్తంది'

ఆరుగాలము కట్టబడ్డ మాదిగగూడెం పల్లె వవతుగ కాక పోవడాన్కి కారణమేందో కొంరనికి తెలువలె....అదే పల్లెల కొంతమంది పెద్దోల్లయి ఇంకొంతమంది కూటికి లేనోల్లయిందెందుకో ? ఆడు గుర్తుసేసుకోలె....పెంట కుప్పలు, ఇరుకుసందుల గుండనడిసి గవులు గొత్తన్న గూడెంల నుంచి ఇల్లు సేరుకున్నడు.

పంచెరి కించనుంచి గుడిసెలోపలకు పోతంటె ఆరేసిన మాంసపు నారలు నెత్తికి తగిలినయ్.... సీ! సీ!

గుడిసె లోపట దీపం సమురులేక మలిగి పోవటాన్కి తయారయింది. తౌడమేన సంటిదాన్ని పండబెట్టుకొని ఏడుసుకుంట గలుమకెల్లి సూత్తంది మల్లి....

అంగకుంటనె గుడిసెలకు సొచ్చిండు. ''నౌసలుకు ఆసం[79] తగిలింది. ''అన్నన్నాయి....'' తడుముకుంట లోపలికి నడిసిండు.

---

79. వాసం

"అచ్చినావ్‌రా? నీ కాడుగాల, పోరగండ్లనోట్లె మన్నుకొట్టి...
మల్లి ఏందేందో తిడుతంది.

"నేనేం జెయ్యాల్నె?'' కొంరడు సేతగానితనాన్ని ఎల్లబెట్టిండు, కూలబడుకుంట.

''ఆలిండ్లుకాల, కూల, కాముని పెంటగాను. నాపోరగాండ్ల కాడి నోటి బుక్క దీసుకున్నోని నోటికాడి బుక్క దేవుడు దీసుకుంటడు. అని సేతులకు నరుప్పులు బుట్ట, జెట్టలు బుట్ట, బోడగుండు సౌవరోని మొల్తాడు దెంప- అని పిట్టకు బెట్ట- అప్పటికప్పుడు జీతమెగబెట్టిండు, ఇప్పటికిప్పుడు దండుగ బెట్టిచ్చిండు. మాలిపటేలోని ఉన్నొక బిడ్డ ముండమోత్తది- నీకేం పాపం జేసినంరో దేవుడ!.... నీ గుల్లైరాయి బడన్‌రోదేవుడా;" ఎటు సాతగాక ఏడుపు మొదలుపెట్టింది.

"అయ్య!.... అయ్య!.... సువ్వురాంగ జొండ్లు దెత్తనన్నవ– గడుకెప్పుడిసురుతం?....బువ్వఓ అవ్వ! బువ్వే....హాఁహాయ్యి....మర్రె హాహో.... సుక్క దాన్ని గొయ్య! ఆకలై సాతనైతలేదంటె ఉరుకు తంది...." రాజిగాడు నిదురల కలువరిత్తండు....

కొంరని మనుసు ఎట్లనో వున్నది. ఆనికి గుడుక ఆకలైతంది. ఆకలికి సిన్న పెద్ద బేదం లేదుగద?.... ఇగ పోరగాండ్లదో లెఖ్ఖ!....

రాజిగాని పక్కకు ఒరిగిండు కొంరడు....

కడుపుల కరకర లాడ్తన్న ఆకలి! కాళ్లు కడుపుదాక ముడుసు కున్నడు. అయిన ఆకలి తగ్గలే—

గుడిసె బయట లేగ ఒర్రింది. ఆవు దాన్ని పిలిసింది.

"లేగ నువ్వు పసురానివైన నీ అదురుట్టం బాగున్నది. ....ఏం బతుకులో ముదినట్టపు బతుకులు !.... సచ్చింది మేలు.... మనుసులము...." సగంల ఆపిండు కొంరడు.

మల్లి ఏడుపు మగ్గి ఎక్కిల్లకు దిగింది.... బయట లేగ పాలు ఛీకుతుంది.... జువ్వికింద ఆకలై కుక్క ఏడుత్తంది.

# 3

తెల్లారిపోయింది.... పల్లె తెల్లారకమునుపె లేసి బతుకు తెరువు కోసరము పారలు, గొడ్డల్లు, కొడువల్లు, నాగండ్లు పట్టుకొని పొలాలల్లకు సేన్లల్లకు ఎటుబోయె టోల్లటు పోయిండ్రు.... తూరుపు కెల్లినుంచి సూరీడు కత్తులు, కటారులు, బాణాలు ఇసురుతున్నడు.

బొత్త కొంరడు ఎటో పోయచ్చి తలకున్న గుడ్డనుదులిపి ముఖం తుడుసుకున్నడు.

మల్లి గుడిసె బయటకచ్చి దుబ్బకొట్టుక పోయిన ఎంటికలల్ల రెండు సేతులుంచి కాసేపు గోక్కున్నది. అ బెనక సిక్కులు దీసి ముడిపెట్టటానిక్కి పయత్నం సేసింది. కాని ఆల్ల బతుకుల తీరుగనె ఎంటికలు అనుగలే.

"అయ్యా! గొడ్డు నిడువే కొట్టుకపోత...." రాజిగాడు కొంరని ఎనుక లేగ తలుగుసేతుల్ల పట్టుకొని సిన్నకట్టె సంకల పెట్టుకొని నిలబడ్డడు.

"ఇంక గొడ్డెక్కడ్డిర? గొడ్డుకు మనకు బాకి సెల్లిపోయింది!" గొడ్డు కెల్లిసూత్తె వాని గుండె తరుక్కుపోతంది.

రాజిగాని కామాట సమజ్‌గాలె....

ఇంతట్లకె కిట్టయ్యె పాలేరు మల్లేశ డచ్చిండు.

"కిట్టయ్య పఠేలు గొడ్డును తెమ్మన్నడు." మల్లేశడు.

"ఏందేంది?...." మల్లి ఎంటికలల్ల సేతులుంచి ఆవుదగ్గరి కచ్చింది అదిరిపోయి.

''మన గొడ్డు నమ్మిన్రే....'' కొంరని గొంతు తట్టుకున్నది.

"నీ సేతులు పడిపోను గదరో; మా అయ్య సంపతి ఈ ఒక్క గొడ్డును గుడుక అమ్మినావురో? నీ దినాల కరుసు[80] కనుకున్నావురో? నా పోరగండ్ల గతేంగానురో దేపుడా(!" సిన్నగ రాగం తీసింది.

కొంరడు గొడ్డుకాడికెల్లి దాని మూతిమీన సెయ్యేసిండు ఎన్నడు లేంది గొడు మట్టుకాన్నె పెనుగులాడింది, బెదిరి బెదిరి సూసుకుంట.... దానికికూడ ఎరుకైందేమొ ?

"నాగొడ్డు...." రాజిగాడు లేగ తలుగిడిసి పెట్టి గొడ్డు దగ్గరి కురికిండు.

కొంరడు గొడ్డును నుచ్చుకొట్టి దాని మెడకు తలుగు తగిలించి దాని తలకాయమీన మొఖంపెట్టి కన్నీలు కారిసిండు.... ''నీకు నాకు రుడం[81]'' తీరిందె.... గొంతికనిండ ఏడుపు నిండుకపొయ్యి మాట పెకల్లే....

---

80. అంత్యక్రియ ఖర్చు 81. రుణం,

మల్లేశడు తలుగు కొసకు పట్టుకున్నడు. గొడ్డు సిర్రు బుర్రు లాడింది. మల్లి బూతులు తిట్టుకుంట బొటబొట ఏడుసుకుంట గొడ్డును పెయ్యంత ముట్టుకొన్నది....

రాజిగాడు ఏడుసుకుంట దాని కాల్లముంగటికి పొయ్యి "నీ కాలు మొకుత మల్లేశన్న.... నన్ను తొక్కిచ్చుకుంట—నా మీసికొల్లి తీస్కపో.... నా ఆవులేగ పోయినంక నేను బతికెందుకు...." అడ్డం పండుకున్నడు.

"గిసొంటోల్లు ఎందు కమ్మిర్రు?" మల్లేశడు గునిసిండు.

మల్లి రాజిగాన్ని జబ్బ పట్టుకొని గుడిసెల కీడ్సుకపోయింది ఏడుసుకుంట....

కొంరడు మారుమాట్లాడకుంట ఆక్కెల్లి నడిసిండు. జువ్వి సెట్టుకింద కుక్కలు మురిగిపోయిన గొడ్డును పీక్కతింటన్నయి. మీన పీరిగద్దలు, బొల్లి గద్దలు తిర్గుతున్నయి.... మల్లి సాపిచ్చుకుంట ఏడ్సుడు ఆనికి కాసంత, కాసంత దూరమైతంది....

ఎనక్కు దిర్గి సూసిండు.

మల్లేశడు దడిపొరుక పీకి గొడ్డు ఈపుమీన జాడిచ్చికొట్టిండు.... ఇన్నేండ్లుగ కొంరడు కొట్టని గొడ్డు— గావురంగా దిరిగిన గొడ్డు-నడ్డిరిసి ముంగటికి సాగింది. దానెనుక లేగ ఒర్లుకుంట ఉరుకుతంది....

కొంరని కండ్లల్లనుంచి— ఇముడలేని నీల్లు రెండు సుక్కలు నేలమీద పడి ఇనికిపోయినయ్....

# 4

పడుమటికెల్లిఅంగిన పొద్దు కడ్డంగ ఎడంసెయ్యి నొసలు మీన పెట్టి కుడిసెయి నడుం మీనేసుకొని ఈకొసనుంచి ఆ కొసదాక పారసూసిండు కొంరడు, తంగెడు సెట్లు తేకు మొట్లు, నడుమ నల్ల రేసుసెట్లు భూమి కన్పిచకుంట పెరిగున్నయ్, సెలుక మజ్జెల్నుంచి ఒర్రె[1] కోసింది, అసలిది సెలక[1a] నటాన్కి ఈల్లేదు, పిల్ల అడివనాతె.

“రేవుకు దేవాలె గాని భూమికి పేదెక్కడిది? కోమటోన్ని పేసనరాదట— భూమిని బక్కదనరాతదట....ఎండకాలమంత మొట్లు మోరల్లు తవ్వి, సెట్లు కొట్టేసి, తూరుపుకెల్లి ఎడెనిమిది బంటాల మట్టి అక్కడ్డంగ[2] పోసి తెట్టగడితె అయిపాయె. రాయిరప్ప ఏరి ఇయ్యేట్కింత పెసల్లో, నూలో అలుకుత[3] —మాగిల[4] బాయి పొక్క బడుత[5] -పండక పోద్దా—సూత్త అదురట్టం—అని భూమిల ఈని భూమిల రెక్కరుసుకుంటె ఇచ్చేది సరిగ్గియ్యరు-అడిగెతె నాన బెదతరు. ఖరాఖండి[6] సేత్తే దేని మీన బెట్టో తంతరు పంచాతంటరు. దండుగ[7] లంటరు. మనుసుల్ని నమ్మే బదులు దున్నపోతుల నమ్మాలెహా(....

మల్ల దోరోరు మతికచ్చిండు[8] ఆ సౌదరోని కుంటకింద పొలమ్మీన కండ్లల్ల అత్తులేసుకొని పసి పోరగాండ్ల సాదినట్టు ఆని

1. నీటిప్రవాహంవల్ల భూమిలోఏర్పడ్డ కోత 1a. మెట్ట 2. వాగుకు అడ్డంగా 3. విత్తుతాను 4. మాఘమాసంలో 5. ప్రవ్వుతాను 6. ఖచ్చితం 7. జుల్మానా (fine) 8. గుర్తుకు వచ్చారు.

పొలము సాత్తె....నాత్రిగూడు లేపిచ్చిండు. ఆఖరుకత్తె ఏందో సేసిన్నని ఓచ్చమెగబెట్టిండు- శలీరమంత అగ్గై మండి ఆమంట ఈమంట కచ్చులానికెదురు తిరిగితె ఈపంత[9] పలుగ్గొట్టిండు.... దీనమ్మ—పెద్దమ్మ పూనినట్టు శలీరండూగింది....అని పాలేరోడు కొంగల పోశడు లేకుంటె పెయ్యంత[10] పికులగొట్టి దౌపతి బట్టలిడిసిన కీసకున్ని సంపి భీమన్న రకుతం తాగినట్టు తాగి— "బలోబల"ని మాదిగిండ్ల సుట్టు సల్లేటోన్ని....అయినా ఆడు లేసినేల్ల మంచిది. పోనియ్యి లంజకొడుకులు ఈకాన్నుంచి నా కాళ్ళ జోలెందుకు?

కొంరని ఇసారం సెలుక దిక్కు పడ్డది.

"ఈ పరం పోగుదుంతె నరారి పంతులుగాదేమన్న అడ్డు పుల్లేత్తడా" కొంరని గుండె బత్తిపెట్టిన బండోలె సెదిరిపోయింది.... సెలక మజ్జెలున్న నల్లరేను సెట్టుకింద కూకున్నడు. సానసేపు పత్తాయించుకొని[11] లేసి నిలబడ్డడు. "పంతులుకేమన్న ఇత్తెడూకోడా! ఏమిత్తడు? తను మొన్నటి దండుక్కె గొడ్డునమ్మిండు. ఇగ అమ్మటానికి గుడుక[12] ఏం మిగలలే. మల్లి సేతుల ముంగటి కడాలున్నాయి. అబ్బో! దానికి గొడ్డునమ్మిన కోపమే కుమ్మరాం[13] మండినట్టు కుతకుత మంటుంది. అదోతీరుమనిషి! అందరివవుతు[14] అంగి తిర్గుమంటుంది. ఇప్పటికే గిట్లున్నది. అంగి తిరుగుతె గుర్రమెక్కరు?....పెండ్లాన్ని ఇంట్లకు తోలు మనరు?....దానికేం

---

9. వీపంతా 10. శరీరం 11.విచారించుకొని 12. కూడా 13. కుమ్మరి వామి 14. వలె

తెలుసు....కిష్టయ్యొచ్చిన ముప్పయున్నొయిగద-పంతులు గాడింటదో? ఇనదో?"ఇట్ల ఇసారించుకుంట పంతుల పల్లె సేరుకున్నడు....

ఇంటి ముంగట కూరుకుతన్న[15] సుంకరి నర్సిమ్మడు కొంరన్ని సూసి "ఏందిర కొంర? ఏడికచ్చినవ్.?" మందలిచ్చిండు.

"నీయక్క! ఈల్ల కెంతమదము? ఈల్లేపంతులయినట్టు"– మనుసుల. "దొరకాడికేర నర్సన్న...."పైకి మర్యాద కన్పించేటట్టుగ అన్నడు కొంరడు.

"దొర అలిట్ట [16] తీస్కుంటండు...."నర్సిమ్మడు.

కొంరడుపాటకుల్ల[17] నుంచి లోపడికి తొంగి సూసిండు. నరారి పంతులు పట్టుకుర్సిల ఒరిగి కూకొని ఎడమసేత్తోటి మీసం దిద్దుకుంట ఏపసెట్టుమీనికి సూత్తండు....కుర్సి ముంగట బల్లమీద బంగారుఫేము కంఠ్లద్దాలు–దానికానించి సిమ్మంమూతి పొన్నుకఱ్ఱ....

"అట్టిగెనెకూకున్నడు గదె?" కొంరడు బతిమిలాడిండు.

"గదె....నే ననేదేందనుకున్నావ్? అలిట్ట తీసుకుంటండు.... అయినా పంతులుతోటి అంత ఏగిర్తం[18] పనేందో?" నర్సిమ్మడు ముంగటికి వాలిన మీసాల సందుల్నించి హేళనగ నవ్విండు. భూమి లేనోడు పంతులు దగ్గెరికెందుకొత్తడని సమజయ్యేటట్టు[19]

"ఏమిలేదే?....కొంరడు నసిగిండు.

---

15. కునికిపాట్లు పడుతున్న 16. అలసట. 17. గేటులో 18. వేగిరం

''సల్లకచ్చి ముంత దాసినట్టుంది నీ ఎవారం.... నాతోని సెప్ప రాదు....నేను దొరకు సెప్పుతె అదో తీరుగుంటది....''నర్సిమ్మడు.

నిచ్చమే ననిపిచ్చింది కొంరనికి....గుడిమెట్టుకింద సెలుక గురించి సెప్పుకచ్చిండు.

అంత ఇన్నంక ఘొల్లున నవ్విండు.

''గండ్లేమి పండుతదిరా! రెక్కలకట్టము తప్పకుతం కలి కలిసేనుకున్నా దాంట్ల ఇత్తనాలు మర్రినట్టయితె [20] నేను సెప్పు తెగ్గోసుకుంట" నర్సిమ్మడు నిక్కచ్చిగా సెప్పిండు.

అయిన కొంరనికి ఆశపోలే. "నువ్వయితె కాసంత నేనచ్చిన్నని సెప్పుపోరాదే?" కొంరడు.

''నాకే మిత్తవు?'' నర్సిమ్మడు లేసి నిలబడుకుంట అన్నడు.

''సేరు సారసీస-సెప్పుత'' కొంరడు

''నీ ఇంట్ల కోడిపెట్టున్నదట? అదిగుడుక ఇయ్యాలె....'' నర్సిమ్మడు.

కొంరడు అయిట్టంగానే తలూపిండు.

నర్సిమ్మడు పాటకులు తీసుకొని లోపలికి బోయిండు. పంతులు కేమి సెప్పిండో కొంరని కినబడలె... కాసేపటికి తిరిగచ్చిండు.

---

19. అర్థమయ్యేట్టుగ 20. మొలిచినట్లయితే

''దండాలు బాంచెన్....'' నెత్తికి సుట్టుకున్న తుండుగుడ్డ తీసి ముఖంకాడ రెండు సేతులతోటి పెట్టుకొని అంగి మొక్కిండు.

నరారి మీసాలు దిద్దుకుంటనె ''ఏందిర బొత్తకొంర.... లంజ కొడుక మొన్న నేసురాందే పంచాతి తెంపుకున్నవట? బలుపచ్చింది.''

''నీ బాంచెన్.... నీ కాలు మొకుత.... నేను కుప్పేసుకోలె—'' అనిగినట్టున్నడు మీదికి— లోపల కుతకుత మంటంది.

''సంగతేంది?''....అని దిక్కు సూడకుంటనే సాలసేపటికి....

''గదే బాంచెన్.... గుడి మెట్టుకింద బాడువ....'' నసిగిండు. కనుబొమలు మడిసి ఇసారించి వోరవోర సూసుకుంట.

''ఎంతిత్తవో సెప్పు....'' కంఠంలో కాఠిన్యం.

''నీ బాంచెన్....సంకలేవత్తె కార్జము కనిపిత్తది....'' పీనంగ మల్లోసారి దండం బెట్టి అన్నడు.

''ఈడికెందుకచ్చినవ్? నర్సిమ్మ! ఈన్ని మెడలుబట్టి....'' సగంల ఆపి పాటకులకెల్లి ఏలుపెట్టి సూపిండు.

కొంరని రకుతం ఏడెక్కుతంది.... మెడల్ పట్టి సూకుతవ్రా! ఊరునుగొట్టి ఇద్దరు పెండ్లాల్ని సేసుకొని, ఒకదాన్ని పట్నంలుంచిండు- అది కిరాయికి కొట్టిచ్చుకుంటంది- ఈని తాతసొమ్ము తింటన్నగద? ఈడు మెడలు బట్టి దొబ్బుడుమరి?....

''నీ బాంచెన్.... గట్లంపెట్ల?'' మల్ల నటన మొదలుపెట్టిండు.

''నూర్రూపాలు.... పట్టుకచ్చి మాట్లాడు....'' నిక్కచ్చిగా- అని మొకం తిప్పుకున్నడు.

కొంరని మనుసు దిమ్మెర పోయింది. అయిన ధైర్రెం తెచ్చు కొని ''నీ బాంచెన్....దెబ్బయిత్త... ఏదో సూసుకోవాలె .., నీకాలు మొకుత'' గద్దెకు మొక్కిండు.

సానసేపు నరహరి మాట్లాడలే,

''అవలెల్లుండి తెచ్చిచ్చి దున్నుకో...నీకెందర్రా కొడుకులు?'' నరారి.

''ముగ్గురు బాంచెన్... అంతాతుక్కే...'' నరారిమాట సమజ్ సేసుకొని అన్నడు కొంరడు.

''అయితె ఓ పదిరోజులు కట్టెలుకొట్టిపో–'' నరారి.

ఈయన సొమ్ము తింటన్నట్టు-దెబ్బయి రూపాలియ్యాలె–ఎట్టికి కట్టెలు గొట్టాలె; లోపల, ''సరె బాంచెన్...'' పైకి,

కడుపుల ఆకలి కరకరలాడ్తంటె పరంబోకు కోసరము- పొద్దు గూకె దనుక పొయ్యిల సెక్కలు నరికిండు కొంరడు-

ఎండకాలము గడిసిపోయెటాల్లకు పోరగాండ్లు, పెండ్లాం, తను కలిసి సెలుకల తంగెడుసెట్లు కొట్టి, మొట్లుతవ్వి, రాల్లేరి బంటాలుతీసి ఒర్రెకు అడ్డందట్టేసి దాన్కో భూమి ఆకారం కలిగిచ్చిండు. సెలక ఆకారానికచ్చింది. ఓకుతం సెలకంత నింపుతె.

# 5

బూరుగాగు నుంచి మంచినీల్ల కడువ మోస్కచ్చి నిట్టాడుకాడ దించింది మల్లి...

''అవ్వా... ఓ అవ్వ బువ్వే! నిన్నగుడుక ఉపాసమే ఉంచితివి. బొత్తసూడవ్వా... ఎడుమదిక్కు కడుపుల నొత్తంది..." సిన్నకొడుకు బానడు ఏడుసుకుంట మల్లి ముంగటికచ్చి ఈడ్సకపోతన్న కడుపును చూయిచ్చిండు. ఆకిట్ల నిలుసున్న రాజిగాడు దుర్గి ఆకలి సూపులు సూత్తర్రు.

మల్లికడుపుల దేవినట్లయింది....సుమ్మర్లు సుడుతంది మనసు. కండ్ల నుంచి నీళ్ళు నతుక్కపోయిన[21] సెంపలమీన్నుంచి కారినయ్. బానన్ని ఎద కదుముకున్నది....

గుడిసెలకు బార సూసింది. రెండుమూడు కాలికుండలు, గడుక[22] పోసుకునేకుండ — మసిబట్టిన ఇంక రెండుమూడు సిన్నకుండలు కనిపించినయి....

కట్టకాలములో గొడ్డుపాలు పిండిపోసేది....దానికి గొడ్డు మతి కచ్చింది. కాని అది గుడుక అమ్మిండు....గొడ్డు తోటట్టుగ తొంట కొంటని కొడుకు లింగడు కర్రెలింగడు మతికచ్చిర్రు.

''అగ్గెనగాల్ల మూడుగిద్దెల అడ్లు నలుభైరూపాలు దండుగ పెట్టిచ్చిరి'' అనుకున్నది.

---

21. పీక్కుపోయిన 22. జొన్న అన్నం

"ఆల్లకడుపుల గాలకొడుకో! ఆల్లిండ్లు కూలగదరో కొడకా—"
ఏడ్సుకుంట పేరు పేరున తిట్టంది....

అంతట్లకే ఓ కర్రెకోడిపిల్ల గుడిసెలకు సొచ్చి పొయ్యిని లవ్వడం మొదలుపెట్టింది. ఆ కోడిపిల్ల తొంటెకొంరని కొడుకుది.

"ఉసో్స....నీ దినాలు గాను, నిన్నెత్తుకపోను, ఇంకేమి మిగిలిందని అచ్చినవ్—నీయిల్లుగాల-నీ ఇంట్ల పిలువ పిల్లలేకుంట మేఅన మేక లేకుంట నాసిడమైపోను....''అక్కసంత కోడిపిల్ల మీన బెట్టితిట్టంగ అటుకెల్లి నీల్ల కడువెత్తుకొనిపోతున్న లింగం పెండ్లము పోసి ఈ మాటలిన్నది. కోడిపిల్లను తరుముకుంట ఈవలకచ్చిన మల్లిని సూసింది.

"లంజెలు కోడిపిల్లను సూసినా, మనుసుల సూసినా కండ్లల్ల కారము పోసుకుంటరు-తీట లమిడీలు[23]'' ముఖంచిట్లిచ్చి కాలు నిలేసి నిలుసుండి అని "తూ.... లంజెకాన....'' కాండ్రించిడుంచి గుడిసెకెల్లి నడిసింది.

అసలే మండిపోతన్న మల్లికి ఆ మాటలు అగ్గిమీనగుగ్గిల మయి సయ్.... రెచ్చిపోయింది. మూన్నెల్లుగ దిగమింగు కుంటన్న దాని సొద బయటపడ్డది.

సేతులాడ్సుకుంట బూతులు దిట్టుకుంట ఆకిలి[24] కొనదను కచ్చింది. "తీటలంజె! నిన్నెవడు పిలిసిందె! కయ్యంబెట్టుకుంటవె? మూలంజె! బరితెగించినలంజె, బట్టలంజె...." మల్లి.

23. తిట్టుమాట 24. వాకిలి

పోసి జెప్పజెప్ప[25] గుడిసెల నీల్లకడువ దించి ఈతలకచ్చింది. "ఏమన్నవె....నేను బట్టులంజెన? బద్మాషిలంజె! తీటలేసి...." దాని ఆకిట్లకచ్చి కయ్యానికి కాలుదువ్వింది.

ఢీ, అంటె ఢీ అనుకున్నరు.... ఇత్తి పెట్టుకొని నెత్తిమీనికి పొద్దచ్చేదనుక తిట్టుకున్నరు. మన్నుపోసుకున్నరు. గూడానికి గూడెం జగడంకాడికి సేరుకున్నరు. ముక్కు మీన ఏలేసుకొని అమ్మలక్కలు సోద్దెం సూత్తంటె మరింత రెచ్చిపోయి పోసి, మల్లి తిట్టుకున్నరు. అన్నమాటనకుంట తిట్టుకొని, తిట్టుకొని ఇద్దరు అలిసిపోయిన్రు.

సివరికి ఎంటికలు బట్టి పూ....మీనదంతె గూదదిగాలె లంజెకాన! ఏమనుకున్నవో?'' పోసి మల్లి దగ్గెరికచ్చింది....

"ఏది తన్నె-తంతావే...." మల్లి పోసిముంగటికెల్లింది.

పోసి పోశమ్మ పూనినవపుతుగనే మల్లి ఎంటికలందుకొని ఇగ్గి[26] ఒక్క తన్ను తన్నింది....మల్లి ఈడుల పోసికంటె పెద్ద....ముగ్గురు పోరగండ్లు .... దానికి తోడుగ బువ్వలేకపోవుటం, కింద కూలబడి పోయింది .... పోసికి అయినా కోపం తగ్గలే .... ఎంటిక లందుకొని గొరగొర ఈడ్సింది. మోకాల్లు గీరుకపోయినయ్ .... రకుతం కారు తున్నది....

రాజిగాడు ఇదంత సూసేటాల్లకు ఉగ్రమచ్చింది. సిన్నరాయందు కున్నడు. ఈడ్సి పోసి తలకాయ గ్గొట్టిండు. నొసలు పలిగి రక్తం సిమ్ముకచ్చింది,

---

25. త్వరత్వరగా 26. లాగి.

గప్పుడు గూడెపోల్లు కదిలిర్రు ఇటుకొంత మంది అటుకొంత మందిసేరి ఇడిపిచ్చిర్రు.

సేంద్లనుంచి అలిసిపోయి ఇంటికచ్చిన కొంరనికి ఈ కొట్లాటను సూసెటాల్లకు మతిపోయింది. ఎటుతోసక మల్లిని రెట్టబట్టుకొని గొరగొర గుడిసెల కీడ్సుకపోయి కుదేసి రెండు తన్నులు తన్నిండు. మల్లి ఏడుసేటానికి గుడుక ఓపికలేక మూల్గుతంది .... అటెనుక ఆని కండ్లల్ల గుబగుబ నీళ్ళచ్చినయ్....

మాపటికి కులపోల్లంత పెద్దమ్మ గుడికాడ కుప్పయిర్రు. పంచాతి జరిగింది....మాదుగులంతా "దెస్సె అంటె, దెస్సె" అని.... తప్పంత దెబ్బలు బడ్డ మల్లిదే సేసిర్రు. దానికి దండుగ యాభై రూపాలు.... ఆ రూపాలు పట్టుకపోయి లక్కెపురం తాల్లల్ల పోద్దాడు[27] కల్లుతాగాలే....ఇది పెద్దమనుసులు నిర్నాయం సేసిర్రు.

పంచాత్ జరిగే టప్పుడు మూలకు గద్దెమీన ఓకాలు మలుసుకొని మోకాలుమీన గద్దువ ఆనిచ్చుకొని పుల్లతో దుబ్బల పిచ్చిగీతలు గీసుకుంట కూకున్నడు కొంరడు.

తీరుపు ఇన్నమోలె[28] దిగ్గునలేసి నిలబడ్డడు. ఆని కల్లు సింత నిప్పుల తీరుగ మెరుత్తన్నయ్.... మోకాల్ల దనుక రెట్టలు[29] గల కొంరడు రెండు గజాలమీన ఎత్తున్న కొంరడు—కారునలుపు శలీరం గల్లకొంరడు—లేసినిలబడితె-అందరికి భయంపుట్టుకచ్చింది. కొంరడు నిలువెల్ల వనికిపోతన్నడు.

---

27. మగచెట్టు 28. వినగానే 29. చేతులు.

లేసి పెద్దమ్మగుడి ముంగటి మట్టి తీస్కొని సేతులపట్టి నెత్తి మీదికెత్తుకొని....“పెద్దమ్మ సాచ్చిగ చెప్పుతన్న.... నేను ఇప్పుడు ఈ దండుగ నాపానం బోయినా కట్టనుర్రా....'' మట్టికింద పారబోసిండు.

మాదిగోల్లల్ల కలకలం.... “కొంరడు పమాణం సేసే,'' పెద్ది గాడు మెల్లెగ అన్నడు... ''అగ్గినీల్లుబందు”

“అది నాకు తెలుసుర్రా. కుక్క బెదిరిచ్చి సెప్పెత్తుక పోయిం దట....అగ్గనీల్లు బందయితయిర....బందు సేసుకోర్రి, కులంలనుంచి పీకేయిర్రి....మురిగిపోయిన గొడ్లనుతిని .... సచ్చిన గొడ్ల ఊళ్లెకెల్లి ఈడ్సేసి కాపోల్లయి, పెరోకల్లయి, దొరోల్లయి ఎందరియేంది? సంబండ వర్నాని [30] కాల్ల మొక్కుకుంట కుక్క బతుకు బతుకనుర– ఈ కాన్నుంచి అట్ల బతుకనుర నాకియ్యాటినుంచి కులంలేదు మాట మాటకు బెదిరిచ్చే ఈ గవులుగొట్టే కులం నా కసలే అద్దు .... మీరుగీ కులానికేన బెదిరిచ్చేటిది?....గంతేగద–ఇంకేం సేసుకుంటరో సేసు కోండ్లి ఓ కులపెద్దల్లాలా! మీ కందరికి నాదండాలు....” సేతులు జోడిచ్చి “ఈ నరకం నుంచి బయటికెల్లిపోత....మీక్కన్పించకుంట పోత... మీరంత ఈ కులం మజ్జెన్నే ఈ సచ్చిన బక్కగొడ్ల మజ్జెన్నే ఈ గవుల కొట్టె మాంసము మజ్జెన్నే–పీతిరిగద్దల మజ్జెన్నే సుఖంగ బతుకుర్రి,.. ఎల్లకాలము సేమంగ బతుకుర్రి... దొరోరు సెర్కము ఒలుసేసినా బాంచెన్ బాంచెననుకుంట బతుకుర్రి, నర్సయ్య, పోశాలు కిట్టయ్య చెప్పులు వట్టి ఈపులు సిట్లకొట్టినా ఇక్కన్నే బతుకుర్రి ఇట్లనే బతుకుర్రి” మల్లికెల్లి దిరిగిండు. ''మల్లిరాయె ఎల్లిపోదాం. ఈళ్లే గూడాన్ని గుత్తగొన్నరు. ఈ కులాన్ని ఈల్ల తాతలముత్తాలకాన్నుంచి

---

30 మొత్తంకులాల

ఈల్లె గుత్తగ్గొన్నరు. ఈ కుల్లిపోయిన పురుగులబడ్డ కులము, గూడెం మనకద్దు" మల్లిని రెట్ట పట్టుకొని గుడిసెల కిగ్గుకపోయిండు.

మాదిగోల్లంత అంతసేపటి కాన్నుంచి భీరిపోయిర్రు. కొంరడు పోయినంక ''బలుపు'' అని ఒకడు– ''కావురం'' అని ఇంకొకడు.. 'కులంనుంచి తీసేయంది కలువది' అని ఇంకొకడు .... ''డక్కలో ల్లండ్ల[31] కలుత్తడని'' ఇంకొకడు నానారకాలుగ ఎవరిట్ట మచ్చినట్టుగ ఆల్లు కొంరన్ని తిట్టిర్రు.

''ఎవని ఖర్మము ఆదేగుడుత్తడు....'' మీదికని, పెద్దిగాడు కొంరడుపోతే ఎదురుండదని లోపల సంబరపడుకుంట లేసిపోయిండు.

గూడానికి ఆని మాటలు మొత్తంమీన కొరుకుడుపడలే....

కొంరడు తెల్లారి గుడిసిచ్చుకొని, బోడిబొక్క పోతుల బండి మీన పెట్టుకొని, ముగ్గురి పోరగాండ్ల పెండ్లాముతోటట్టుగ గుడిమెట్టు కింది పరంపోగు సెలుకలకు తరిలిపోయిండు.

''గు....మీన తన్ని ఎవరో అయింత భూమి గుంజుకుంటరు..'' మాదిగోల్లంత అనుకున్నరు....

*　　*　　*

సెలుక మూలకు కొంరడు గుడిసేసుకున్నడు.

''లింగా!'' పుట్ట గడ్డమీన నిలుసుండి ఎనకకు సూడకుంటనె పిలిసిండు పెద్దొర వెంకటరెడ్డి.

"ఏందురిర్రి బాంచెన్....?'' కంచె సూపిత్తన్న కంచెకావలి లింగడు పక్కగోలుగ నిలుసున్నడు.

---

31 (మాదిగ వారికంటె తక్కువగా చూడబడే) నిమ్నజాతిలో

''బొత్తకొంరడు మాదిగిండ్లల్లనుంచి ఎల్లిపోయిండట కదర?''
బట్టతలమీన ఎండ సురుక్కుమంటే సేతపునుక్కొంట అన్నడు.

''బొన్రి బాంచెన్. రకుతముర్రి, రకుతం బాంచెన్'' ఆడు
అడివికెల్లి సూసుకుంట అన్నడు.

దొరోరికి మాటలు సమఝ్‌గాలే.

''రకుత మేంది బంచెత్....'' అడుగు ముంగటికేసి సేతులున్న
పొన్నుకట్టెను గాలిల ఆడిచ్చుకుంట....

'గదేన్రి....నెత్తురు....ఆనాడు మీ కెదురుగచ్చిండా.... నిన్న
కులపోల్లమీనికి మర్రబడ్డడా? అదంత నెత్తురు బలిమికాకుంటేంది
బాంచెన్....?'' లింగడు.

"ధుత్తెరి, లంజకొడుక! ఊకుండు." ఓ దిక్కు బట్టతలమీన
ఎండ ఇటు ఎదురుగచ్చిండనే మాట కసిరింది.

లింగని ముఖం సమురు లేని దీపమోలె ముడుసుకున్నది. ఇగ
ఆడుపెదువు ఇప్పలే.

కాసేపయినంక "మర్రైతె ఎటుపోయిండాడు?" మూలమలుపు
తిరిగినంక దొర మల్లఅడిగిండు గ్యాపుకమచ్చి.

"గీన్నె బాంచెన్, పంతులోరు పరంపోగు చూయిచ్చిన్రు: గుడి
సేసుకున్నడు.'' అడివికెల్లి ఏలుపెట్టి చూయించిండు.

''ఇన్నిరోజులు నాకు సెప్పలే-మనకంచె బందుకు[32] గుడిసేసుకొని

---

32 పక్కకు

ఎవ్వారం సేత్తంటె సూసుకుంట ఊకున్నవ? పోదాం పా! తోలు ఒలుత్త!'' మీసంమీన సెయ్యేసి అడుగేసిండు.

''అడివిల ఏమున్నది బాంచెన్ అది అనికి దేపుడిచ్చిన శిచ్చ ఆరుగాలము కట్ట బడ్డా ఇత్తుపండదు. బలువంగుతది" సిన్నంగ నవ్విండు లింగడు.

దొరోరు సానసేపటిదనుక మాట్లాడకుంట గునాయించుకున్నడు ఇగ ఇంటికి బోయెదనుక ఎవ్వలతోటి మాట్లాడలె.

తెల్లారి మాదుగులందరిని పిలిపిచ్చిండు.

''పెద్దిగ!....నిన్న లింగడు సెప్పుకచ్చిండు: కొంరడు మాదిగిండ్లల్లసుంచి ఎల్లిపోయిండట నిజమేన?'' పెద్దిగానికెల్లి సూసుకుంట.

''బాన్చ్రి,'' సేతుల పిసుక్కుంట అన్నడు పెద్దిగాడు.

"జెట్టిమ్మ ఊళ్లెసుంచి ఎల్లిపోయింది. నరెగాని పెద్దులు నా కాని మీన్నే కోపంగని మీ మీనెక్కడిదిర? ముంగటినుంచి నీరటి బిచ్చం పెత్త....'' ముసిముసి నవ్వుకుంట అన్నడు.

ముంగటిక్కి పెడతనన్న బిచ్చానికి మాదుగులంత తబ్బిబ్బయి పోయిండ్రు దొరోడు సాచ్చాత్తుగ మాల్లెకిట్టడు సెప్పిన దానకర్నుని వవుతుగ, సిందిమావిగి సాయిమల్లదేసిన పచ్చరి సంద్రునిగ కనిపించిండు.

"నీ బాంచెన్....గరీబోల్ల కడుపులమీన కొడితె మీకేమత్తది? పుర్రసేయి[33] దులుపాలె బాంచెన్....మీ అసొంటి పెద్దలోకులు లేకుంటె మాసొంటి గరీబోల్లెట్ల బతుకుతరు? బాంచెన్...." ఇట్లపొగిడిండ్రు.

33. ఎడమచేయి

దొరోరు కొంరన్ని ఇట్టమచ్చినట్టు తిట్టిండు. అటెనక సెప్పు కుంటనె ఇంట్లకెల్లపోయిండు.

మాదిగోల్లంత సంబరంతోటి గూడానికి మరల్రు.

''గొప్పోల్ల బుద్దులు గుడుక గొప్పగుంటయిర్ర....కొంచెగాని[34] కెపగిరితం....[35]'' పెద్దిగాడు ఊసిపోయిన పేలుక గుండుకు సుట్టు కుంట అన్నడు.

అందరు ''నిచ్చమే'' నన్నట్టుగ తలలూపిర్రు.

# 6

రెండేండ్లు గడిచిపోయినయ్.

ఈ రెండేండ్లల్ల ఈ దేశంల గరీబోల్లు ఎన్నితీర్ల కడుపు తిప్పల్లు పడు తన్నరో? ఉనోల్ల కాల్లకింద గడ్డిపూల వపుతుగ[36] గినలిపోయిన మానాలు, నల్ల సీమలవవుతుగ నలిగి పోతున్న పాణాలెన్నో? తరతరా లుగ కూడు కోసరం తన్నుకొని సచ్చినోల్లు, గుల్లకోసరం, రాజ్యాల కోసరం కొట్టుక సచ్చినోల్లు ఎంత మందో? సచ్చినోల్లమీన కథలు రాసిరుర్రి....బిరుదులు తీసుకున్నరు....రాణీగారి కాలిగోరి సింగారం గండపెండేరాలు తీస్కున్నరు. రాణీగారు సిలుకకు రోగమత్తే కవులు ఏడిసిరుర్రి....కాని పేదోల్ల బతుకుల గురించి పట్టిచ్చు కునోడు లేడు.... పట్టు పరుపుల మీన పండుకొని టూగుటుయ్యాలల్ల వూగిపోక సెక్క లేసుకొని పల్లెల పారే ఆగునుసూసి ఆహా అన్నారు....

---

34 అల్పునికే 35 వేగిరం. 36 వలె

ఇట్ల రాసుకుంట పోతంటె దీన్కి అంతం లేదు....కథకంచికి తీర్థయాత్రలకు పోతది....నేను ఆల్లల్లకే పోత....

కొంరని బతుకు గుడుక సాన మారిపోయింది.....రకుతాన్ని, మాంసాన్ని మన్నులో కలిపిండు....కని ఆనికి దొరికింది కడుపుమంట-దరిద్రం....అట్లయిన ఆనికండ్లల్ల బతుకు కోసరము పోరాడాలె అన్న ఆశ మాత్రం దీప మోలెవెలుగుతనే ఉన్నది.

మల్లి ముఖంల మాత్రము కొట్లాడి అలసిపోయిన నీడ కన్పిత్తది దానిముఖంల ఎన్నికట్టాలు బడ్డదో? అన్ని ముడత లేర్పడ్డయి. రాజి గాడు కొంరని చేతి కందిండు.

"వన మిడిసిన కోతి ఊరిడిసిన మనిషి ఒక్కటే" అన్న దొరోళ్ళ. వనమిడిసిన కోతి మనుసుల్లకచ్చి నరకం సూత్తది. కాని కులమిడిసిన కొంరడు వనం బడితె సర్గంకన్పడ్డది.

దొరల లెక్క[37] జంతుల బాదపెట్టలె ....సగం సగం కొరుక్క తినే దొరోరి కంటె ఒక్కసారె గొంతుక కొరికే పెద్దపులే నయం.... అందుకోసరమే జంతువుల కంటె క్రూరమైనోల్లు దొరలు.

మాదుగులంతకొంరనితిక్కకుదురుద్దనుకున్నరు. కాని మాదిగోల్ల తిక్కెకుదరలే కులంలేకుంట ఆడెట్ల బతుకు తున్నడొ గూడానికి సమజ్ గాలె. "దుట్టుని జూసి దేవుడు గుడుక దూరముంటడు-మనమోలెక్కా" అనుకున్నరు గొడ్డును కోస్కునేకాడ.

కొంరడు సెలుకల రాయిరప్పలేకుంటజేసి అంపులు మిట్టలు సమానం జేసిండు దచ్చినం దిక్కు బాయి తోడిండు.

37 వలె

మాగి కాలంల మూడెకురాల మక్కజొన్న పెట్టిండు. ఆని కట్టము కొద్ది కర్రలు మొట్లకు మొట్లూరి యూడిచ్చి కర్రకు రెండు కంకులు పెట్టినయ్ కంకవనం వపుతగ పెరడి ఊగుతంది.

ఏగిలి వారుతంది.[38] గుట్టసుట్టూరుత నాత్రేసిన మనసు [39] పంజ రాన్ని నరకటానికి తూరుపు నుంచి సూరుని కాంతి కత్తులు కటారు లిసురుకుంట, బాణాలు కొట్టుకుంటబండిగీరె వవుతుగ దూసుకవత్తంది.

కొంరడు మోట కొడుతండు దున్నపోతుల అదిలించుకుంట. రాజిగాడు నీల్లు కడుతండు. మల్లికుండలు కడుక్కుంటంది.

"అబ్బ! ఇయ్యేడు నా కట్టము భూదేవర సూసింది—నెనరు [40] పుట్టింది. ఈయేటి పంట రెండు పుట్లయితే పోతుల నమ్మి కోల్లాగెల తీసుకోవాలె. గుడిసె గట్టిగ సేసుకొని గూనేసు కోవాలె.'' కొంరని మనసుల ఆలోచనలు ఈ తీరుగ నడుత్తున్నాయి.

మోటగీరె "కిర్రు కిర్రు" మని రాగం తీత్తంది అడివిల సీతువ పలుకుతాంది, మల్లి కసికెతోటి గుడిసెకాడ గటుక్కుంండ గీకుతంది, మోటబొక్కెన జల జల నీల్లు ___న్న సప్పుడు. ఇవ్విటిని సూసెటా ల్లకు కొంరడు తనకు తాను మరచిపోయి కూనిరాగ మందుకున్నడు.

"వాడ కదిలించిరా! జంబాయిరే!

బెజ్జవాడ కదిలిందిరా జంబాయిరే!"

"మామ; అంత మంచేనాయె." దోరోరి పాలేరు అంకడు ఎడ్ల మేపటానికచ్చి కొంరని బాయికాడి కచ్చిండు.

---

38 తెలవారుతున్నది 39 మంచు 40 ప్రేమ

కొంరడు పాటను జల్దిఆపిండు. అంకని కెల్లి సూసిండు, కొంరని మనసుల ఇప్పుడు ఈసు [41], పగలకు తావులేదు.

''మంచేన్ అల్లుడా! గూడమంత బాగున్నరా?'' కొంరడు.

''ఆఁ గూడెం సంగతి నీకు తెలువద? మావ!'' పెదవి ఇరుసుకుంట అన్నడు అంకడు.

కొంరడు కొంతసేపు మాట్లాడలే. అపెసుక దండెడ ఇగ్గుకుంట[42] ''ఏదోర అల్లుడా! దొరల కిందసుంచి బయటికత్తెనే బతుకురా—'' కొంరనిమాట నీల్లసప్పుల్ల కలసిపోయింది.

అంకడు పెరటి కెల్లి సూసిండు. కండ్లు చిరుతలు కమ్మినయ్. ''భూదేవర నిన్ను ఇయ్యేడు ఎత్తుకున్నది. మావఁ. మనిషిని నమ్మితె సెప్పు[43] దెబ్బలు. అంగుతె [44] ఎక్కుతడు-కూకుంటె తొక్కుతడు, నిలబడితె మొక్కుతడు, ఏం మనుసులో ఏమొ!'' అంకడు పండ్లపుల్ల ఇసిరేసి ముఖం కడుక్కోను దోని[45] కాడికి నడిసిండు.

''అవ్వల్లజ్జిగ[46] సెప్పినవరాఅల్లుడా!'' గట్టిగ నవ్వుకుంట అన్నడు ఛాతి ఎగిరెగిరి పడ్డది.

''ఈ సంగతి యిన్నవానె?- మావాఁ! (మాదిగి) కొండన్ని కచ్చులం దొరగితె[47] పడ్డందుకు ఆరుగట్టిరిగెదనుక కొట్టిండు దొర. ఆని శరీరమంత రకుతంతోన గూడెంల కొస్తె అడిగే దిక్కులేదు.

---

41 ఈర్షన 42 మోటతాడు లాగుతూ 43 చెప్పు 44 వంగుతే 45 నీటిప్రవాహం కోసం ఉన్న ఏర్పాటు (ఉదా: తాటి దోని) 46 చాలా బాగా 47 బండిచక్రం లేచి ఉల్టాపడుట

పదిరోజుల కిందట దొరోరి[48] కొడారికాడికి పైడిగానికి సద్ది కొంట బోయిన పైడిగాని పెండ్లాం రాయపోసిని బలిమిటికి[49] కచ్చేరింట్లకు ఈడిసి పెడగొట్టిండు దొర. పొద్దుగాల్నె అది బాయిలోపడి చచ్చింది. గూడెం అంతా గుబగుబ లాడ్తంది. అయినా ఎవలూ బయటపడలే. ఏందో.... అంతా....!"

కొంరడు యింటున్నడు.

మల్లి నీల్లకడవ పట్టుకొని మోటకాడికచ్చి అంకన్ని సూసింది. "అంకన్న బాగున్నవా?" అడిగింది పేమగ.

"బాగనే ఉనన్నత్త" నీల్లు పుక్కిలించి ఊంచి అన్నడు.

ఆమాట ఈమాట మాట్లాడి అంకడు ఎడ్లకాడికి పోయిండు.... కొంరని పెరడి సంగతి పాలేరోల్లందరికి సెప్పిండు సంబర బడుకుంట. గూని సమ్మనికి కడుపుబ్బింది....

వేసంగి వరి బంతి కొట్టంగ దొరోరి సెవులేసిండు .... దొరోరు ఉలిక్కిపడి మల్ల అడిగిండు—బంతికాడ చిందొరనుంచి[50] అదేకాల్లమీన కంచె కాడికచ్చిండు దూరంగ నిలుసుండి కొంరని పెరట్నిసూసిండు.... కండ్లల్ల అగ్గి కురిసి నట్టయింది....ఎడమ మీసం మీన సెయ్యేసిండు.... ఎనుకకు మర్రి ఇంటి కచ్చిండు.

మూడు రోజుల దనుక పొద్దాటి కల్లు సయిసారము లేకుంటయి పోయింది.

---

48 దొరవారి 49 బలవంతాన 50 చిన్న దొరను ఉంచి 51 రుచి

''లంజెకొడుకు—పంతులు నరారి గాడెంత పన్జేసిండు?'' పొగాకు సుట్ట తాక్కుంట నరారి పంతులును పెండ్లమాలు తిట్టిండు.

అయిన: తొవ్వ దొరకలె— సమజ్‌గాలె— నరారి పంతులుకు దొరోరికి ఒకల కాలుసెప్పు ఒకలకు పడదు.... పరంబోకులకాడ పంచా తచ్చింది.... బాగా ఇసారిచ్చుకున్నడు.

అర్జునునికి కిట్టమూర్తి గాపుకం అచ్చినట్టు లక్ష్మారెడ్డిబావ గాపుక మచ్చిండు. ''దీనితల్దె.... ఇన్ని రోజులు బావ ఉన్నాడనుకోలే—'' పొన్ను కర్ర ఊపుకుంట అనుకున్నడు.

సాకలి రాయనర్సన్ని జరూరుగ [52] పిలిపిచ్చిండు.

''పిలిపిచ్చిర్రట? బాంచెన్....'' దండం బెట్టిండు దూరంగ అంగి—

''ఇగో- ఊరికి బోవాలె.... సిన్నకచ్చులం గట్టు....'' హుకుం జారీచేసిండు.

''నీ బాంచెన్ దొర! మా ఆగి ఆపతి[53] వత్తంది— ఇంట్ల నేను తప్ప మొగోల్లు లేరు. మంత్రసాని ముసల్దాన్ని తీస్కరావాలె బాంచెన్.. నీకాల్ మొకుత బాంచెన్....'' భయపడుకుంట బతిలాడిండు.

''మాదర్‌సోత్[54]....బడువ లంజకొడక నాకె వయిసం బడితె అంకలు[54a] సెప్పుతవ? ఇయ్యాల్ల పెండ్లం నీల్లాడ్తది. రేపు అవ్వ వత్తది....'' పొన్ను కర్రగాలిల ఊపిండు.

---

52 అర్జెంటుగ 53 పురిటి నొప్పులు 54 (తిట్టుమాట)
54 a. సాకులు

రాయనర్సడు గుడ్ల నీల్లు గుడ్లల్ల కుక్కుకున్నడు. బండికట్టి ఒరు గుడు మెత్తాలు పెట్టిండు.... ఎద్లకు గజ్జె పేరేసిండు. దొర బండిలో కూకొని ఆరుగట్టై గాలిల "చెల్" మనిపిచ్చిండు. బండికదిలింది.

బండిగీరెలు గిఁగిఁమని రాయనర్సని గుండెమీన తిర్గినయ్. బువ్వ తినకుంటనె రాయనర్సడు బండి ముంగిట ఉరుకు తండు.

బండి ఉరుకుతంది. బలిసిన కోల్లాగెలు, దొరోరి ముల్లు కట్టె ముడ్డిమీన దిగుతంటె రేసానికచ్చి [55] ఉరుకుతన్నయి....

''ఇంట్ల ఆగి మూలుగుతంది కావచ్చు—పోరగండ్లు సుట్టూరుత సేరుకొనిఏడుత్తరుగ్రి కావచ్చు. ముసలి అవ్వ దగుకుంట మంచము కాడ పుసుకుతంది కావచ్చు....ఆగి ఆగి.... నొప్పలతోటి మలుకలుతిర్గిపోతన్న ఆగి...."ఏడికి పోతన్నవ్...." ఆగి ''దొర జరూరుగ పిలిపిత్తండువల్లె మీనికి పోయత్త, జెప్పనరా! నీ బాంచెన్....నేను బతుకుతనో బతకనో? మూడు కాన్పులకు గుడుక ఇంత గనం నొప్పులురాలే'' గట్లనెకె కడుపుల దేవినట్టయితది'' అగి ఏడుస్తుంది ''ఓరి నర్సవ్వా! జెప్పనరారా!" ముసల్ది ''ఆగి-ఆగి....'' రాయనర్సడు ఉరుకుతండు. అని మనుసుల గుడుక ఆలోచనలు ఉరుకుతన్నయ్. గజ్జె పేరుమోత - బండిగీరెల సప్పుడు— ఇన్పించుడులేదు. కని అనికి ఆగిమూలుగు మాత్రం ఇన బడ్తంది.

దొరోరు కయిలకోడె ముడ్డిమీన ముల్లుగట్టె గట్టిగ కుచ్చిండు. కయిలికోడె ఆ కోపముల రాయనర్సన్ని గూటింది. రాయనర్సడు

55 కోపానికి వచ్చి

బొక్క-బొర్ల పడ్డడు....కోల్లాగె తొక్కి-ంది. సదురుకునేటాల్లకే ఎడుమ సేయి బండిగీరెకింద నలిగింది....

గప్పుడే ఊల్లెకిలగికిపిండం వచ్చి ఎదురుతిరిగింది .... దిక్కు-లేక....మూలిగిమూలిగి ఆగి మూలుగుడు ఆగిపోయింది. పోరగాండ్లు మునల్ది ఘొల్లుమన్నరు,

దొరోరు ఎనుకకు సూసిన్రు. మతిభోయింది.... రకుతం బట్ట లల్లఉన్న నర్సిగాన్ని బండిమీనేసుకొని బండెక్కి-ండు....

బావోరి ఊరు సేరుకున్నడు.

బావ లక్ష్మిరెడ్డి ఎంకటరెడ్డి పొయేటాల్లకు పరేషాన్[56]ల పట్టె మంచమ్మీన పండుకున్నడు,

''ఏంబావ! ఎప్పుడురాక?'' లక్ష్మిరెడ్డి.

"ఇప్పుడే వత్తున్నానోయ్— అన్నీ అవశకునాలె" ఎంకటరెడ్డి.

"శకునాల సంగతటుంచు తవరువేల్లగానేల్ల ఇంత జరూరుగ సుక్క-తెగి పడ్డట్టచ్చిరేం?'' లక్ష్మిరెడ్డి.

"ఏమిలేదు బావ!'' ఎంకటరెడ్డి మంచమ్మీనకూకుండి.

''చెప్పుబావా'' లక్ష్మిరెడ్డి ఇప్పసార అందిచ్చుకుంట.

''బాపూ....'' పదారేల్ల పడుసుపిల్ల ఆడికచ్చింది....

---

56 ఆందోళనలో

ఎంకటరెడ్డి పెదువులు తడిసేసుకున్నడు పడుసుపిల్ల ననుకట్టు కెల్లి సూసుకుంట—ఇప్పసార గొంతుల మందుతంది ....లక్ష్మరెడ్డి ఎంకట రెడ్డిని సూసిండు.

''ముసలోడైనా పాడుబుద్ధి పోనిచ్చుకోలే'' లోపల, ''కృష్ణ! లోపట్కి పోవే....'' మీదికన్నడు లక్ష్మరెడ్డి.

కనుబొమ్మలు ముడుసుకొని వెనుకకుదిరిగించి....ఎంకటరెడ్డి ఆపిల్ల ఎనుక పొడగాటిజడ—లయగ కదుల్తున్న పి....లు సూత్తండు....

''చెప్పవోయ్....'' విసుగ్గ అన్నడు లక్ష్మరెడ్డి.

''ఆఁ....అన్నట్టు—ఏమిలేదులే-మాదిగో డొకడు ఎదురు దిరి గిండు నా కంచె దాపుల పెరడు చేస్కున్నడు.'' ఎంకటరెడ్డి.

"సేసుకుంటె నీ కొంపేం మునిగిందోయ్—" లక్ష్మరెడ్డి

''అదిగాదోయ్ బావా! ఆది ఫసలుకు మర్రింది. ఆరెకరాలు— పరంపోగే ననుకో-నాకంచె నంబరు కిందున్నది....'' ఎంకటరెడ్డి.

"అదా కత-? నరారి మొఖాన ఏమన్న పారేయకపోయినవ." లక్ష్మరెడ్డి పావుమీనపావు ఇప్పసారా ఎక్కిత్తండు.

''కృష్ణా!.... అమ్మసు నల్ల[57] పంపుమను....పోందేడ బోయిండు?'' ఇంట్లకు కేకేసిండు....

పోరడు నల్ల పట్కచ్చి మంచం కాడిబల్లమీన పెట్టిపోయిండు. ఇద్దరు తింటన్నరు....

---

57 గడ్డకట్టిన రక్తాన్ని వేడిచేయగా ఏర్పడేది

''పారేత్తననుకో....ఆ పారేసేదేదో? నువ్వు పారేత్తే మంచి గుంటవని.' ఆనికినాకు....'' మజ్జెలోనే ఆపి నల్ల నోట్లేసుకున్నడు.

సరే! సూత్తాముగని....ఇప్పుడునేను బడేపరిషాన్ల ఉన్ననోయ్– ఎలుకల పెల్లి రామిరెడ్డిగాడు అడ్డం తగిలిండు. సడుగుగుత్త పట్టిన సంగతి నీ కెరుకే గద? సడుగు మిరుపతోటల్నుంచి పోతందని కాసంత అంకర తిప్పి ఆని సేండ్ల నుంచి ఏపిచ్చిన....ఆడుపోయి హైకోరుట్ల నుంచి స్టే పట్టు కచ్చిండు.ఎవ్వారం ఇంత దనుకచ్చిందని నాత్రికినాత్రే ఆనిపేటి కరంటుమోటరుపీకిచ్చిన–ఆడు కేసుపెట్టిండు.నాకురేగిందనోయ్– ....నిన్న మొన్న కండ్లు తెరిసిన రాంరెడ్డిగాడు నాకు ఎదురు తిర్గుతడ? లక్ష్మిరెడ్డి పేరుసెప్పితె పసిపోరగండ్లు పాలు దాగకపోవాలె .... నాకాం డాని....ఆ లుచ్ఛే[58] రాంరెడ్డిగాడెదురు తిర్గడమా! నాత్రికి నాత్రే, నా మనుసుల్ని పంపించి పెండ్లాన్ని, బిడ్డను ఖరాబు సేయించిన, రామిరెడ్డి గాన్ని డొక్కలిరుగ తన్నిచ్చిన-అంతదనుక మంచిగనే సాగింది.

కని అచ్చిన సిక్కల్ల ఏందో తెలిసిందా! ఆని పాలేరోన్ని మొన్న సెమ్మము ఒలిసింటి–ఆనితోటి కేసు పెట్టిచ్చిండు-ఆనికి దమ్ము లేక, డి.యస్.పి. అచ్చిండు. నాలుగు వేలిచ్చిన-పాలేరోన్ని సితుక తన్నిచ్చిన.

కని రాజ్జెం బాగలేదోయ్. ఆడు హైకోరుట్ల పెట్టిండు. ఇస్పెసెల్ పోలీసొచ్చింది. నా పాలేరోల్లను యాభైమందిని జైల్లేసింది. పదివే లూడినయ్'' గుక్కతిప్పకోకుంట సెప్పిండు లక్ష్మిరెడ్డి.

పదివేలనే సరికి వెంకటరెడ్డి మతిపోయింది. కాసింతసేపు మాట్లాడలే.

---

58 నీచుడు (తిట్టు)

''గదేమయితదిగని....'' పావు గొంతులపోసి గుటకమింగిండు,

ఇప్పుడేందోయి ఏగిరం....? పంటకు రానియ్యరాదు-పాలేరోల్ల తోని కోయిత్తాము....'' లక్ష్మారెడ్డి పొగాకు సుట్ట మొదలుకటుక్కున కొరికి అగ్గిపుల్లగీకి ముట్టిచ్చి గుప్పున పొగ ఇడిసిండు—ఇప్పసార నిషా బాగా ఎక్కింది.... కండ్లుబాగా ఎరుపెక్కినయ్.

''సల్లటిమాట సెప్పినవోయ్. ఇకనేన్ బోత(....'' ఎంకటరెడ్డి మాట తడబడ్తంది....లేసి నిలబడ్డడు.

''అప్పుడే ఏం మునిగిపోయిందోయ్.... కూకో....'' రెండు మూడు రోజులుండిపోదుపుగని''లక్ష్మారెడ్డి కండ్లు మూతలు పడ్తన్నయ్.

"సాకలోడు గీరె కిందపడ్డడు. జెట్టిలంజకొడుకు. ఆని పెండ్లాం....' సెయ్యిరిగింది....'' అడుగేసిండు...

బండి కట్టి సిద్దంగ ఉన్నది... బండెక్కిండు. సాకలోడు బాధ తోటి మూలిగిండు...

* * *

మల్లో రెన్నెల్లు గడిసినయ్. ఓనాడు లక్ష్మారెడ్డి, ఎంకటరెడ్డి నరారి పంతులింటికి అచ్చిరు[59]

లక్ష్మారెడ్డిని సూసెటాల్లకె కురిసిల్నుంచి దిగ్గునలేసి ఎదు రచ్చిండు నరారి."నరారిపంతులు...కులాసేనా?'' లక్ష్మారెడ్డి సుట్ట కింద పారేసి సెప్పుకాలుతోటి రాసుకుంట అన్నడు.

---

59 వచ్చారు

"ఏదో తమరి దయవల్ల" నరారి తెచ్చిపెట్టుకున్న భకితితోటి. ముగ్గురు కురిసీలల్ల కూకున్నరు. లోపల్నుంచి చాయ్ అచ్చింది.

"నరారి....గుడిమెట్టు కింద పరంపోగు కొంరని పేరు మీన రాసినవట.'' మా బావ కంచె ఆక్కన్నేగద? బావ సెవుల కాసంత ఏత్తె నీ ముల్లేంపోయింది"? వోరగసూసుకుంట.

నరారి మాట్లాడలే.

"సూడు నరారి మా బావ ఎడ్లకు తిప్పలైతంది. ఆ పరంపోగు" లక్ష్మారెడ్డి పొగాకు సుట్ట కొత్తది తీసి కటుక్కున కొరికిండు.

''అదెట్ల సాజ్జెం? దొరగారు!'' నరారి నసిగిండు.

''ఘటికుడివేనోయ్. నీకు సాజ్జం కాదా? బలే వానివోయ్! మొత్తంమీన కన్నపుబుద్ది పోనిచ్చుకోలే.'' ఘొల్లున నవ్విండు.

నరారి కిందికి తల ఆల్సుకొని తల గోకిండు:

"గవీ సంగతిని సూటిగ సెప్పరాదోయ్? అగ్గిపుల్ల గీసిండు.

''ఏదో మీదయ,'' నరారి.

"నాస్పకోయ్. నా సంగతి నీకు తెల్సుగద పదిహేను నూర్లు'' సుట్టపొగ ఊదిండు.

నరారి మాట్లాడలే—

''గదే నాస్పద్దన్న...ఇంకో అయిదునూర్లు'' కుర్సిల్నుంచిలేసి నిలబడ్డడు లక్ష్మారెడ్డి. ఎంకటరెడ్డి రెండు వేల రూపాయలు నరారిసేతి కిచ్చిండు.

నరారి మీసాల సందుల నవ్వు.

ఆ మాపటికే లక్ష్మారెడ్డి ఎల్లిపోయిండు.

❊ ❊ ❊

# 7

"నీ యక్క పందులెక్కన్నుంచి అత్తన్నయి? రాత్రి కుంచెడు జొండ్లకు కొట్టినయ్. రేపు పెరడి కోసెయ్యాలె–పులిపచ్చి ఉన్నదను కుంటే పందులు దక్కనిత్తలేవ్..." అడివిపంది కొట్టిన కర్రల ఏరు కుంట రంధి పడ్తండు కొంరడు.

దట్టి మీనికచ్చి పంటకచ్చిన మక్క పెరబెల్లి సంబురంగ సూసిండు. కిందికిపడి నోట్లె కచ్చిన మీసాల కొరికి ఏందో గాపుక మచ్చి ఎడుమసేతమీదికి తిప్పిండు.

దూరంగ దట్టపొంట రాజిగాడు దున్నపోతుల మేపుతండు. కొంరడు అడుగేసిండు. కాలుకు ముల్లుకుచ్చింది.

"నే యవ్వ కడుపుగాల బగ్గనే కుచ్చినవ్... నీపన్జెప్పుతుండు" మోటకాన్నుంచి గొడ్డలి పట్కచ్చి మొదట్లకు రేగు తుప్పెను కొట్టేసిండు.

మల్లి గుడిసె ముంగట కూకుండి పచ్చికంకులు ఒలుత్తంది...

కొంరడు అనుకోకుంట పల్లెకెల్లి సూసిండు.

పంతులునరారి ఎంకటరెడ్డి, పోశాలు, నర్సయ్య, కిట్టయ్య ముంగట అత్తండ్లు ఆళ్ళెనుక పది పదిహేనుమంది తన పెరట్యాల్లి[60] అత్తన్నట్టు కన్పించింది. గొడ్డలి భుజాన పెట్కోని భీరిపొయ్యి సూసుకుంట నిలబడ్డడు.

ఎనకచ్చేటోల్లంత దొరోరి పాలేరోల్లు ... సేతుల్ల కొడవల్లు వున్నయి.

పెద్దొర ఎంకటరెడ్డి కొంరని కెదురుంగచ్చి నిలబడ్డడు.

కొంరని ముఖంల రంగులు మారినయ్...

''కొంరా?'' ''కన్న కొడుకును బుదుగరిచ్చినట్టు పిలిసిండు?''

''ఏంది బాంచెన్?'' కొంరడు సెత్రి సూసిన గొడ్డు వపుతుగ.

''ఈ పెరడి ఎవ్వల్నడిగి దున్నినవ్? ఇది నా కంచెల్ది ....'' కర్ర పెరటిమీనికెల్లి తిప్పి సూటిగ సెప్పిండు.

సంగతేందో కొంరనికి తెల్సింది....ఆని ముఖం భీతిపొయ్యి ఎటకారం అచ్చింది,

"దొరా! ఇదినీ కంచెల్దా! పంతులోరినడుగుర్రి. మీముంగట్నే ఉన్నడు." నరారి పంతులుకెల్లి ఏలు పెట్టి సూయించిండు.

''ఔనర్రికొంర. ఆనాడు కాయితాలు సూడకుంట నిన్ను దున్నుకొమ్మన్న....ఇది దొరోరి కంచె నంబర్లున్నది. అయిన నిన్ను రెండేండ్లకో మూడేండ్లకో దున్ను కొమ్మన్న గని ఎల్లకాలముంచు కొమ్మన్ననా?" నరారి ముఖం సిట్లించుకుంటు అన్నడు.

---

60 పెరడు వైపుగా

కొంరని గుండె బత్తిపెట్టిన బండోలె పగిలింది. సొన సేపటి దాక ఆని గుమ్మిలనుంచి మాటెల్లలే....అటెనుక ఆని కండ్లు సింత నిప్పులయినయ్....అంగిలేని ఆని సాతి ఎగిరెగిరి పడ్డది.

''సర్పయ్యా పటేలా! మీరు గుడుక అదే మాటంటరా?'' ఆని గొంతులో కాఠిన్యం.

"ఔనాత్రి కొంర....''ముగ్గురు ఒక్కసారే అన్నరు. నాయం[61] సెప్పెపెద్దమనుసులు!

రాజిగాడు, మల్లి, కడుమ[62] ఇద్దరు పోరగండ్లు అక్కడికి చేరిర్రు.

''అంటే తమరు పెరడు కోస్క పోనచ్చిర్రా?'' అందరి ముఖాల్లలకు సూసుకుంట అన్నడు.

"లంజకొడుక....నీయవ్వన్దెం....కావురమచ్చిందా?'' ఎంకట రెడ్డి ఇహ లాభంలేదని—బెదరించటానికి కాలుసెప్పు ఊడపీకిండు.

"ఎంకటరెడ్డీ! మాటలు జాగర్తగ రానీయ్ .... ఎవ్వడనుకొని మాట్లాడ్తున్నవ్?" గొడ్డలి ఆని సేతుల మెరిసింది.

ఎంకటరెడ్డి సేతుల్లసెప్పు కిందేసిండు.

''అరే....అంకా, దుర్గా సమ్మా, కొండా, మీరంత నా పెరడు కోయటానొచ్చిర్రా? ఇజ్జత్లేదు. దుర్గా, నీ ఉన్న రెండు దొయ్యలు సావుకారి కిట్టయ్యకు ఉప్పు పప్పుకింద ముట్టసెప్పి దొరోరి కాల్లు నాకు

61 న్యాయం 62 మిగతా

తన్నప్ ఇంకా సాలలేదా? కొండా: నీ ఈపంత పిగుల గొట్టింది మరికి లేదు. దుర్గా! నీ పెండ్లాన్ని దొరోరు ఖరాబు చేత్తే ఆ తప్పుకు కులపోల్లు నిలేత్తే అగ్గెనగాండ్ల గుడిసమ్మి దండుగగట్టింది యాదికిలేదు. ఎందుకురా నానోటి మీని కెల్లి సెప్పిత్తరు? దొరమీన మీకు నిజంగ పేమున్నదారా? ఈ దొర-ఈ పటేండ్లు కాలుమీన కాలేసుకొని తింటాన్కి పుట్టంగనే బమ్మతోటి రాయిచ్చుకచ్చిండ్రా?. మనం....ఈల్ల నచ్చిన గొడ్ల ఈడ్సేసుకుంట ఈల్లపాదాల కింది మట్టి తాకుతే తన్నులు తినుకుంట-మురిగిపోయిన గొడ్లను కోస్క-తినుకుంట బతుకాల్నా? ఆరుగాలము ఎండల, సలిల, ముసుర్ల శరీరాన్ని మాడిసి, నాన్పి కట్టబడితె మనకేమొ తింటాన్కి గింజలు దొరకయ్...కట్టము సేయించుకొని కూలిగింజ లెగబెట్తరు మాట్లాడితె దండుగ తీస్కుంటరు... ఇదేనారా నాయం...? ....మీకందరికి తెలువదారా? మీరంత నన్ను ఊల్లెనుంచి ఎల్లగొట్టిండ్రు... ఇన్నిరోజులు ఉపాసముండి, ఉప్పిడుండి—ఈ అడివిని పెరడు సేస్కున్న....ఎవ్వనయ్యసొమ్ము నాకిచ్చిండ్రు? సెప్పుండ్రి .... నేనెవ్వల ఇల్లన్న కట్టుకచ్చిన్నా? దోసుకచ్చిన్నా? ఈ నరారి పంతులు అగ్గెన గాండ్ల దెబ్బయి రూపాలు తీస్కోని పదిరోజులు కట్టెలు కొట్టిచ్చుకొని ... "నరారి పంతులూ! తూ! ఏం జల్మమునీది! అడుక్కుంటె ఇంకియ్యకపోదునా? నీ కంటె దున్నపోతునయం." కొండ్రకిచ్చి దట్టమీన ఊంచిండు.

నరారి పంతులు సెప్పిసిరుండు. కొంరని నొసలుకు తాకింది. బొడుసచ్చింది.

ఎడుమ సేత పునికి సూస్కున్నడు....కొంరడు ఊగిపోయిండు.

"మంచి మాటకు సెప్పుతన్న....పోండి నా పెరట్కానుంచి పోండి....లేకుంటె నేనేం సేత్తనో నాకే తెలువదు" కొంరడు గొడ్డలి భుజాన పెట్టి ఉగ్రనర్సిమ్మ సామి రూపం దాలిసిండు.

'సూత్తరేంరా ! అన్ని ఇరిసి కట్టేయిన్రి....' దొర పాలేరోల్ల కెల్లి సూసిండు.

"కట్టేత్త రారా? కట్టేయాలిసింది– నన్నుకాదుర ఈల్లను...." అయిదుగురి దిక్కు ఏలుపెట్టి సూపిండు.... "ఈల్లయిదుగురు, జెనిగెల[63] వపుతుగ పీలుసుక తింటన్న ఈల్లు మాదిగ గూడెంల ఒకని శరీరంల మాంసమున్నదారా? ఆ మాంసమంత ఈల్లకున్నది... మన మెంతమంది మున్నము? ఇంతమంది ముండి...ఈల్లు మనల్ని తూ(...ఈల్లు సెప్పితె మనం మనం తన్నుకొని సావాలె– దూరంగ నిలుసుండి ఈల్లు నవ్వుతరు. అంకన్నా ? దుర్గన్నా–కొండన్నా ? మీ అందరికి నేను బుద్దెరిగి సప్పన్నుంచి ఏమన్న పాపం జేసిన్నాసుర? ...కులంలేదని గూడెంల నుంచి ఎల్లగొట్టిరి...నా మానాన నేను అడివికచ్చి బతుకుతంటి, అట్లయిన బతుక నియ్యన్రి?...'' కొంరని కంఠం జీరవోయింది.

''సూత్తరేమున్రి?" దొరోరు గద్దరాయించిండు.

పాలేరోల్లంత ఒకల ముఖా లొకలు సూసుకున్నరు. కొంరడు సెప్పిన దాంట్లఆల్లకు అబద్దమేమీ కన్పించలే. ఇన్నేండ్లు తన్నినదొర ...పెండ్లాలను ఖరాబుసేసినదొర—అంతటిదొరను ఎదురించలేక కుమిలి పోయిన్రు. కొంరడు గొడ్డలి భుజాన పెట్టుకొని ఎదురిత్తండు, ఇప్పుడు

63 జలగల వలె

కొంరన్ని ఇరిసి కట్టేత్తె రేపుదుర్గన్ని, కొండన్ని... ఇట్లా అందర్ని కట్టేసి తంతండు...

పాలేరోల్లు సప్పుడు చేయకుంట నిలబడ్డరు.

"లంజకొడుకులారా!..,మీకు..."పొన్నుకర్ర నెత్తిండు ఎంకట రెడ్డి ఏనునుకున్నడో ఏమొ?—మల్ల దించిండు.

దొరకు ముచ్చెమటలు పోసినయ్—గుండె జెప్పజెప్పకొట్టుకున్నది, ఈ మాదుగులంత సెప్పు కింది నల్లులనుకున్నడు. ఇప్పుడుతేల్లయి పోయిర్రు. ''బలవంతంబగు సర్పము చలిచీమల చేతజిక్కి చావదె సుమతీ...'' సిన్నప్పుడు సదుపుకున్న పజ్జెం. ఇప్పుడేంసేయాలే?... బాంచెలు- మాదుగులు ఏకమయిర్రు కొంరనికెల్లి చేరిర్రు. ఇన్నేండ్లుగ ఎదురులేకంట సాగుతన్న దొరతనం—ఓడిపోతంది...ఏంసేయడం?...

పోశాలు, కిట్టయ్య, నరారి మాటలు రాక సూత్తర్రు.

అంకని సేతుల కొడవలి గుంజుకున్నడు. పెరట్లకడుగుపెట్టిండు. ఎనకకుపోతే మాదిగోల్లు, పాలేరోల్లు.

''రెడ్డీ..." గాండ్రిచిండు కొంరడు, మనిసి ఊగిపోతండు—సేతులగొడ్డలి.

''మిమ్ములందరిని నరికి ఈ దట్టమీన కుప్పలు పెడుత, అటె నుక నా పెండ్లాన్ని, పోరగాండ్లను నరికి నేను సత్త ... ఈ పెరడి బొబ్బిలిగావాలె'' గొడ్డలి గాలిల తిప్పిండు.

ఎంకటరెడ్డి ఆగి ఖండవతోటిముఖంమీని సెమట తుడుసు కున్నడు...అడుగు ముంగటికేసిండు.

కొంరడు దబదబ దట్టమీనికెల్లి వెంకటరెడ్డి కెల్లి నడిసిండు. దొరోరి సాతిమీని లాలిసివి ఎడుమ సేతపట్టి ఒక్కసారి కుదిచ్చిండు.

రెడ్డి కొడవలి పైకిలేపిండు. గొడ్డలితోటి ఒక్క దెబ్బ కొడవలి మీన కొట్టిండు— సెయికి దెబ్బతాకకుంట— కొడవలి పోయి పెరట్ల బడ్డది...కొంరని దవుడమీన గుద్దిండు రెడ్డి.

కొంరడు పులోలె రెచ్చిపోయిండు... గొడ్డలి పారేసి ఈడిసి దవుడమీన గుద్దిండు. దవడ పండ్లూసినయ్. నోటినింద నెత్తురు.

రెడ్డి పాలేరోల్ల కెల్లి ఆశగ సూసిండు. పాలేరోల్లు ఊగుతర్రు.. కాని అడుగు ముందుకెయ్యలే.

నర్సయ్య, పోశాలు, కిట్టయ్య, నరారి ఇంటి తొవ్వ బట్టిర్రు.

రెడ్డికి దుఃఖమచ్చింది... కాని ఏంజేత్తడు ? కొంరడు దొరో రిని ఈడుసుకచ్చి దట్ట ఆవలికి గట్టిగ నూకిండు. దొరోరు బొక్కబోర్ల పడ్డడు. దొరోరు— ఇన్నేండ్లు గరీబోల్ల తోలు పికుల గొట్టిన దొర నొసలు సిట్లింది.

ఇగ లాభం లేదని ఎనక్కు సూడకుంట లేసి ఉరుకుతండు...

మాదిగి కొంరడు గెలిసిండు...మాదిగోళ్ళు గెలసిర్రు.

"అంకా, కొండా, దుర్గా, మల్ల ఈ పెరడు దట్ట తొక్కకుర్రి. మతికుంచుకోర్రి. ఈ దొరలు కూకుంటె తొక్కుతరు- అంగితె ఎక్కు తరు— నిలబడితె మొక్కుతరు, రాయే మల్లి" మల్లి రెక్కబట్టుకొని గుడిసెకెల్లి నడిసిండు. పెద్దపెద్ద అడుగులేసుకుంట.

పాలేరోల్లకు అట్లా గుడిమెట్టు కెల్లిపోతన్న కొంరడు గుడి మెట్టంత ఎదిగి నట్టనిపించింది.

పల్లెకెల్లి మర్రిల్రు. ముంగట పోతన్న నర్సయ్య. పోశాలు, కిట్టయ్య, నరారి, ఆళ్ళెనక గోసి ఊసి పోంగ రాల్లల్లబడి ఉరుకుతన్న పెద్దోర– సీమల వవుతుగ [64] అనిపిచ్చిర్రు.

ఎదురు తిరిగితే దొరలంతా కాయితం పులులే. కాని... కొంరడు ఒక్కడే ఎదురు తిరిగితే లాభం ?

(అయిపోయింది)

(ఈ కథలోని పాత్రల పేర్లూ, సంఘటనలూ కేవలం కల్పితం. ఎవరినీ వుద్దేశించి రాసినవి కావు. –రచయిత)

64 చీమల వలె